రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలి!



3లో

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే విజయాలు సొంతం


3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 328 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 21 నవంబర్ 2026

మతం, కులం పేరుతో బీజేపీ రాజకీయాలు!

● ఓట్ల కోసమే ప్రజల మధ్య విభజనలకు ప్రయత్నం ● అమిత్‌షాకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్..
దక్షిణాది ప్రయోజనాలకు డీలిమిటేషన్ ప్రమాదకరమని ఆందోళన



హైదరాబాద్,నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): ఓట్ల కోసం బీజేపీ కుల, మత రాజకీయాలకు పాల్పడుతోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. హిందూ, ముస్లింల ఓట్ల కోసం ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వారి మధ్య పెద్దగా పోటీ లేదని వ్యాఖ్యానించారు. నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే అమిత్‌షా హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓవైసీని ఓడించాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ మాత్రం అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.హైదరాబాద్‌లోని హోటల్ పార్క్ హయత్‌లో శుక్రవారం జరిగిన 'ఏబీపీ న్యూస్ సదరన్ రైజింగ్ సమ్మిట్-2026'లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని జాతీయ, మిగతా2లో...

నాగరికతల అనుసంధానానికి సాంకేతికతే వారధి

● ఎస్‌సీఓ దేశాల మధ్య సాంస్కృతిక సహకారానికి ప్రధాని మోడీ పిలుపు
● తొలి నాగరికతా సంభాషణల వేదిక ప్రారంభం.. వారసత్వ సంపదనుద భవిష్యత్ తరాలకు అందించడంలో సాంకేతికత కీలకం



న్యూఢిల్లీ,నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): ప్రపంచ దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడంలో ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, నాగరికతల మధ్య పరస్పర అవగాహన పెంపొందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఢిల్లీలో తొలి షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) నాగరికతా సంభాషణల వేదికను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల మధ్య సంబంధాలు కేవలం వాణిజ్యం, భద్రతకే పరిమితం కాకూడదని, సాంస్కృతిక అనుబంధానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వేల ఏండ్ల మిగతా2లో...

ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు

● 400 డ్రోన్లు, 100 క్షిపణులతో విరుచుకుపడిన రష్యా సేనలు ● 8 మంది మృతి.. 28 మందికి గాయాలు.. కీవ్‌లో మూడు వంతెనలు ధ్వంసం



కీవ్,నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): అమెరికా, చైనా దేశాధినేతలతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్రైపాక్షిక చర్చలు జరిపిన కొద్ది గంటల్లోనే ఉక్రెయిన్‌పై రష్యా సేనలు భారీ దాడులకు పాల్పడ్డాయి. శుక్రవారం మిగతా2లో...

సిద్దిపేటలో పోటీకి రా.. ప్రజల ముందే తేల్చుకుందాం!

కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు ద్రోహం చేసింది కాంగ్రెస్సే
299:512 నిష్పత్తికి అంగీకరించినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా..
నిరూపించలేకపోతే సీఎం పదవికి రాజీనామా చేస్తావా?



హైదరాబాద్, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): సిద్దిపేట సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. దమ్ముంటే వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట నుంచి తనపై పోటీ చేయాలని, ప్రజల ముందే ఎవరి సత్తా ఏమిటో తేల్చుకుందామని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట

మిగతా2లో...

విద్యారంగానికి దిక్సూచి.. చుక్కా రామయ్య

● 101వ జన్మదిన వేడుకల్లో ఘనంగా సత్కారం..
విద్యా సేవలను కొనియాడిన ప్రముఖులు


2లో

కావేరి జలాలు ఉంటే తమిళనాడుకు ఇచ్చేవాళ్లం

● మా రాష్ట్రంలో తాగడానికి కూడా నీళ్లు లేవు
● కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యాఖ్యలు



హైదరాబాద్,నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): కావేరి జలాల వివాదంపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ రాష్ట్రంలో సరిపడా నీటి నిల్వలు ఉంటే తప్పకుండా తమిళనాడుకు నీటిని విడుదల చేసేవారమని తెలిపారు. అయితే ప్రస్తుతం కర్ణాటకలో తాగునీటికి కూడా కొరత ఉందని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందని స్పష్టం చేశారు.కావేరి జలాల విడుదల కోరుతూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. కర్ణాటక రిజర్వాయర్లలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని, పరిస్థితి తీవ్రంగా ఉందని చెప్పారు. ఈ ఏడాది కావేరి నదికి సంప్రదాయంగా నిర్వహించే 'బాగిన' పూజను కూడా చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. **11 టీఎంసీల నీటి కోసం పిటిషన్లు** కర్ణాటక నుంచి మిగతా2లో...



భూముల ఆ సర్వేకు మార్గదర్శకాలు

రైతులకు నాలుగు రోజుల ముందే నోటీసులు
ఆరు దశల్లో సర్వే ప్రక్రియ.. అభ్యంతరాల పరిష్కారం తర్వాతే తుది రికార్డులు

హైదరాబాద్,నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్రంలో భూముల రీ సర్వే నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సర్వే ప్రక్రియలో అధికారులు పాటించాల్సిన నిబంధనలతో కూడిన ఉత్తర్వులను సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్ విడుదల చేశారు. గ్రామాల వారీగా భూముల కొలతలు, రికార్డుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం, తుది రికార్డుల ఖరారు కోసం ఆరు దశల విధానాన్ని రూపొందించారు.రీ సర్వేకు నాలుగు రోజుల ముందే రైతులకు నోటీసులు ఇవ్వాలని, రెండు రోజుల ముందుగా పట్టాదారులకు గుర్తింపు జెండాలు అందించాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన వెంటనే కొలిచిన భూమి విస్తీర్ణాన్ని రైతులకు తెలియజేయాలని సూచించారు. పహాణీలో

మిగతా2లో...

ఏఐ కేంద్రంగా హైదరాబాద్

● ఐరాస వేదికపై
మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటన



హైదరాబాద్,నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): కృత్రిమ మేధ (ఏఐ), పరిశోధనా రంగాలకు హైదరాబాద్‌ను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఐక్యరాజ్యసమితి వేదికగా జరిగిన 'గ్లోబల్ ఇంపాక్ట్ సమ్మిట్'లో ఆయన ప్రసంగించారు. తెలంగాణను ప్రపంచస్థాయి సాంకేతిక కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి 'రైజింగ్ తెలంగాణ'లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఐటీ, ఏఐ, జీవశాస్త్ర రంగాల్లో తెలంగాణకు విస్తృత అవకాశాలున్నాయని మంత్రి వివరించారు. వైద్యం, విద్య, పర్యావరణ రంగాల్లో ఏఐ వినియోగంతో సమూల మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మిగతా2లో...

మతం, కులం పేరుతో బీజేపీ రాజకీయాలు!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర రాజకీయాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. బీజేపీ జాతి, మతం, భాష పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తోందని ఆరోపించారు. ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం మతపరమైన అంశాలను ముందుకు తెస్తోందని విమర్శించారు. **దక్షిణాదికి డీలిమిటేషన్ ముప్పు** కేంద్ర ప్రభుత్వం చేపట్టాలనుకుంటున్న నియోజకవర్గాల పునర్విభజన దేశంలోని దక్షిణాది రాష్ట్రాల భవిష్యత్తుకు పెను సవాల్‌గా మారుతుందని రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచితే ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు దక్కి, కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది ప్రాధాన్యం తగ్గిపోతుందని హెచ్చరించారు. మొత్తం 850 సీట్లలో ఉత్తరాదికి 650, దక్షిణాదికి 195 స్థానాలు మాత్రమే వచ్చే అవకాశం ఉందని వివరించారు.ప్రస్తుతం కేరళలో 20, ఉత్తరప్రదేశ్‌లో 80 లోక్‌సభ స్థానాలు ఉన్నాయని, 50 శాతం పెంపు తర్వాత కేరళలో 30, యూపీలో 120 స్థానాలు అవుతాయని తెలిపారు. దీంతో రెండు రాష్ట్రాల మధ్య సీట్ల వ్యత్యాసం 60 నుంచి 90కి పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ విధానం దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. జనాభా, జీడీపీ ఆధారంగా '50 శాతం ఫార్ములా' అమలు చేయాలని సూచించారు. **543 స్థానాల్లోనే మహిళలకు రిజర్వేషన్లు** మహిళా రిజర్వేషన్ల అమలుకు కొత్త చట్టాలు, రాజ్యాంగ సవరణలు అవసరం లేదని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల్లోనే 181 స్థానాలను మహిళలకు కేటాయించవచ్చని సూచించారు. మహిళలకు నిజంగా ప్రాతినిధ్యం కల్పించాలనే చిత్తశుద్ధి కేంద్రానికి ఉంటే వెంటనే అమలు చేయాలని కోరారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి కాంగ్రెస్ సహకరించిందని గుర్తుచేశారు. **తెలంగాణలో బీజేపీకి ఉనికి లేదు** తెలంగాణలో బీజేపీకి రాజకీయంగా పెద్దగా ఉనికి లేదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీకి డిపాజిట్ కూడా దక్కలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తమకు ప్రధాన ప్రత్యర్థి బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తానని, కేటీఆర్‌ను మాత్రం సీరియస్‌గా తీసుకోనని అన్నారు. కేసీఆర్‌ను 'రావణాసురుడు'గా, కేటీఆర్‌ను 'మేనేజ్‌మెంట్ కోటా' నాయకుడిగా అభివర్ణించారు. బీఆర్ఎస్ నాయకులు పగటి కలల్లో జీవిస్తున్నారని విమర్శించారు. **మోడీ పాలనపై విమర్శలు** ప్రధాని మోడీని 'విజిటింగ్ ప్రైమ్ మినిస్టర్'గా అభివర్ణించిన రేవంత్‌రెడ్డి, ఆయన విదేశీ పర్యటనలపై విమర్శలు చేశారు. సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. మోడీ 12 ఏండ్ల పాలనలో రూ.120 లక్షల కోట్ల అప్పులు చేశారని, గత ప్రధానులందరి పాలనలో కలిపి అప్పులు సుమారు రూ.53 లక్షల కోట్లు మాత్రమేనని పేర్కొన్నారు. దేశంలో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు, విద్యాసంస్థల నిర్మాణంలో గత ప్రధానుల పాత్రను ప్రస్తావించారు.అదానీకి ప్రజల సొమ్మును మోడీ ప్రభుత్వం మళ్లిస్తోందని ఆరోపించిన సీఎం, తెలంగాణలో మాత్రం పెట్టుబడుల ద్వారా ప్రజలకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని చెప్పారు. రాహుల్‌గాంధీ చేపట్టిన 'ఓట్ చోర్‌గద్దీ చోర్' నినాదానికి దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందన్నారు. యువతలో మార్పు వస్తోందని, మోడీ పాలనపై ఉన్న భయాన్ని 12 రోజుల్లోనే జెన్‌జీ యువత తొలగించిందని వ్యాఖ్యానించారు.

సిద్దిపేటలో పోటీకి రా.. ప్రజల ముందే తేల్చుకుందాం!

(మొదటి పేజీ తరువాయి)

సభలో అభివృద్ధి, ప్రజా సమస్యలు, నిధుల గురించి మాట్లాడకుండా బీఆర్ఎస్ నేతలపై విమర్శలు, వ్యక్తిగత దూషణలకే సీఎం ఎక్కువ సమయం కేటాయించారని ఆరోపించారు.రాష్ట్రంలో మూడేండ్ల కాంగ్రెస్ పాలన అన్ని రంగాల్లో విఫలమైందని హరీశ్‌రావు విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని, సాగునీటిని సక్రమంగా వినియోగించుకోకుండా తెలంగాణను కరువు పరిస్థితుల్లోకి నెట్టిందని ఆరోపించారు. కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పరోక్షంగా సహకరిస్తోందని మండిపడ్డారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై రుద్దిన కరువని వ్యాఖ్యానించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు సైతం ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, అనిరుధ్‌రెడ్డి కమీషన్ల వ్యవహారాన్ని ప్రస్తావించగా, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాలన సరిగా లేదని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు.

దేశవ్యాప్త బీసీ కులగణనకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి..
బీసీలకు సామాజిక న్యాయం జరగాలి: కేటీఆర్



హైదరాబాద్,నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): దేశవ్యాప్తంగా ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) కులగణన చేపట్టాలన్న డిమాండ్‌కు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బీసీలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలంటే సమగ్ర కులగణన అవసరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.ఈ మేరకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలన్న తమ డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన కేటీఆర్.. బీసీల హక్కులు, సామాజిక న్యాయం కోసం చేపట్టే కులగణనకు బీఆర్ఎస్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని తెలిపారు.కులగణన ద్వారా దేశంలోని బీసీల వాస్తవ జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు, విద్యా, ఉద్యోగ రంగాల్లో వారి ప్రాతినిధ్యంపై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. జనాభాకు అనుగుణంగా హక్కులు, అవకాశాలు కల్పించేందుకు ఇది కీలకమని అభిప్రాయపడ్డారు. కేవలం జనాభా లెక్కలతో సరిపెట్టకుండా, ఆ వివరాల ఆధారంగా బీసీల అభ్యున్నతికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.గతంలోనే తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలన్న లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ అంశంపై చొరవ తీసుకుందని వివరించారు. అలాగే, బీసీల సమస్యలు, రిజర్వేషన్ల అంశాన్ని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పార్లమెంట్‌లోనూ ప్రస్తావించారని తెలిపారు. బీసీలకు న్యాయమైన వాటా దక్కాలంటే కులగణనతో పాటు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల అమలుపై కూడా కేంద్రం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నా రు. దేశవ్యాప్తంగా ఓబీసీ కులగణన కోసం విద్యార్థి సంఘాలు, బీసీ సంఘాలు చేస్తున్న ప్రయత్నాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు

(మొదటి పేజీ తరువాయి)

తెల్లవారుజామున డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడ్డాయి. ప్రపంచ శాంతికి కట్టుబడి ఉన్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కలిసి పుతిన్ ఉమ్మడి ప్రకటన విడుదల చేసిన తర్వాత ఈ దాడులు జరగడం గమనార్హం. ఎనిమిది గంటలకు పైగా కొనసాగిన దాడుల్లో ఎనిమిది మంది మరణించగా, 28 మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. **400 డ్రోన్లు.. 100 క్షిపణులు**రష్యా సేనలు సుమారు 400 డ్రోన్లు, కనీసం 100 క్షిపణులను ప్రయోగించాయని ఉక్రెయిన్ ఆరోపించింది. వీటిలో 120 జెట్ ఆధారిత డ్రోన్లు ఉన్నాయని తెలిపింది. రష్యా దాడులతో రాజధాని కీవ్ తీవ్రంగా దెబ్బతింది. నగరంలో పేలుళ్ల శబ్దాలు వినిపించగా, దట్టమైన పొగలు అలుముకున్నాయి. మూడు వంతెనలు ధ్వంసమవడంతో రవాణా వ్యవస్థకు అంతరాయం ఏర్పడింది. **పోలాండ్ గగనతలంలోకి రష్యా డ్రోన్లు** దాడుల సమయంలో రష్యా దళాలు పోలాండ్ గగనతలాన్ని ఉల్లంఘించాయని ఆ దేశ ప్రభుత్వం తెలిపింది. తమ భూభాగంలో కొన్ని వస్తువులు పడటంతో యుద్ధ విమానాలను రంగంలోకి దించడంతోపాటు పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థలను అప్రమత్తం చేసినట్టు వెల్లడించింది.**జనావాసాలపైనా దాడులు** ఉక్రెయిన్ సైనిక, ఇంధన కేంద్రాలు, ఓడరేవులు, రవాణా మౌలిక సదుపాయాలే లక్ష్యంగా దాడులు చేసినట్టు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. అయితే ఖార్కివ్‌లోని ఆస్పత్రితోపాటు పలు ప్రాంతాల్లో నివాస భవనాలపైనా దాడులు జరిగాయని ఉక్రెయిన్ ఆరోపించింది. మరోవైపు ఉష్ణోగ్రతలు సున్నా కంటే తక్కువకు పడిపోతున్న సమయంలో దాడుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

కరీంనగర్‌లో బీజేపీ మహా పాదయాత్ర

- 23న జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాక.. రాష్ట్ర నేతలతో కలిసి రెండు కిలోమీటర్ల మేర యాత్ర



హైదరాబాద్,నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్‌లో ఈ నెల 23న నిర్వహించనున్న బీజేపీ మహా పాదయాత్రలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పాల్గొననున్నారు. 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకత్వాన్ని పాతరేద్దాం' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. పాదయాత్రకు సంబంధించిన ఏర్పాట్లను పార్టీ రాష్ట్ర నాయకత్వం పర్యవేక్షిస్తోంది. ఈ నెల 23న ఉదయం 11 గంటలకు నితిన్ నబీన్ హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12 గంటలకు కరీంనగర్ కలెక్టరేట్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం కరీంనగర్ వైశ్య భవన్‌కు వెళ్లి మహా పాదయాత్రలో పాల్గొంటారు. వైశ్య భవన్ నుంచి టవర్ సర్కిల్, శాస్త్రి రోడ్డు మీదుగా కమాన్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర యాత్ర కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్‌తో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొననున్నారు. పాదయాత్రను విజయవంతం చేయాలని రామచందర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. **ఓటర్ల జాబితా సవరణపై ప్రజలకు వివరణ** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో రాజ్యాంగ సంస్థలపై ఇండియా కూటమి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడంతో పాటు, ఈ ప్రక్రియకు సంబంధించిన వాస్తవాలను ప్రజలకు వివరించడమే పాదయాత్ర ఉద్దేశమని బీజేపీ నాయకులు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు.

నాగరికతల అనుసంధానానికి సాంకేతికతే వారధి

(మొదటి పేజీ తరువాయి)

చరిత్ర కలిగిన భారతీయ నాగరికత ప్రపంచానికి ఎన్నో విలువలను అందించిందని పేర్కొన్నారు. దేశంలోని మ్యూజియంలు, గ్రంథాలయాలు, పురావస్తు కేంద్రాల్లో భద్రపరిచిన అపారమైన వారసత్వ సంపదను ఆధునిక సాంకేతికత సాయంతో ప్రపంచానికి పరిచయం చేయవచ్చని తెలిపారు.డిజిటల్ వేదికలు వివిధ దేశాల ప్రజలను, సంస్కృతులను దగ్గర చేస్తున్నాయని చెప్పారు. ఎస్సీఓ సభ్య దేశాల మధ్య భద్రత, ఆర్థిక వ్యవస్థ, అనుసంధాన రంగాల్లో సహకారంతోపాటు నాగరికతల పరస్పర మార్పిడికి కూడా అవకాశాలు విస్తరించాలని ఆకాంక్షించారు. ఉమ్మడి చరిత్ర, సంప్రదాయాలు దేశాల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని వివరించారు.మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి భారత్ ఆతిథ్యమిస్తోంది. ఢిల్లీలోని చారిత్రక పురానా ఖిల్లాలో నిర్వహిస్తున్న ఈ సమావేశాల్లో పాకిస్తాన్ సహా పలు ఎస్సీఓ సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, నాగరికతల మధ్య సంభాషణలు, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై ఇందులో చర్చించనున్నారు.

విద్యారంగానికి దిక్సూచి.. చుక్కా రామయ్య

హైదరాబాద్,నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య 101వ జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు రూపొందించిన 'మన చుక్కా రామయ్య.. వందేళ్ల పండుగ' పుస్తకాన్ని జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమానికి పలువురు రాజకీయ, విద్యా, సామాజిక రంగాల ప్రముఖులు హాజరై రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చుక్కా రామయ్యకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్రను గుర్తుచేశారు. విద్యారంగంలో ఆయన చేసిన సేవలు ఎంతో విలువైనవని, ఐఐటీ విద్యను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. తెలంగాణలో ఆయనకు సమకాలీకులు లేరని పేర్కొన్నారు.జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. చుక్కా రామయ్య రాజ్యాంగ విలువలకు ప్రతీకగా నిలిచారని ప్రశంసించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కోదండరామ్, కూనంనేని సాంబశివరావు, జూలకంటి రంగారెడ్డి తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యను కేవలం ఉపాధి సాధనంగా కాకుండా సమాజ మార్పునకు మార్గంగా భావించిన రామయ్య సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు.వందేళ్లు దాటిన వయసులోనూ విద్య, సమాజం పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత యువతకు ఆదర్శమని పలువురు అభిప్రాయపడ్డారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, నాణ్యమైన విద్య అందరికీ చేరాలనే లక్ష్యంతో ఆయన సాగించిన ప్రయాణం స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

కావేరి జలాలు ఉంటే తమిళనాడుకు ఇచ్చేవాళ్లం

(మొదటి పేజీ తరువాయి)

11 టీఎంసీల కావేరి జలాలను విడుదల చేయాలని ఆదేశించాలంటూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఆ రెండు పిటిషన్లను తోసిపుచ్చింది. అదనపు పత్రాలను సమర్పించేందుకు తమిళనాడు దాఖలు చేసిన మరో దరఖాస్తును కూడా కొట్టివేయనున్నట్టు ధర్మాసనం సూచించింది.కావేరి జలాలు, మేకెదాటు ప్రాజెక్టుపై తమిళనాడు కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై కాంగ్రెస్ అధిష్ఠానంతో మాట్లాడతానని డీకే శివకుమార్ తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, వాస్తవ పరిస్థితులను పార్టీ నాయకులకు వివరిస్తానని పేర్కొన్నారు.

ఏఐ కేంద్రంగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

యువతకు నైపుణ్య శిక్షణ అందించి, వారి ఆలోచనలను ప్రపంచస్థాయి ఆవిష్కరణలుగా మలుస్తామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ భాగస్వామ్యాలు, పెట్టుబడులకు తెలంగాణలో అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు.

భూముల ఈ సర్వేకు మార్గదర్శకాలు

(మొదటి పేజీ తరువాయి)

నమోదైన విస్తీర్ణానికి, క్షేత్రస్థాయి కొలతలకు తేడాలుంటే వాటి కారణాలను ఫీల్డ్ రిజిస్టర్‌లో స్పష్టంగా నమోదు చేయాలని పేర్కొన్నారు.భూ వివాదాల పరిష్కారానికి తహసీల్దార్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి శిబిరాలు నిర్వహించాలి. శిబిరాల అనంతరం మూడు, నాలుగు రోజుల్లో కేసులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. గ్రామ పెద్దలు, బాధిత రైతులు, పక్క భూముల యజమానులతో చర్చించి వివాదాలను పరిష్కరించాలని ఆదేశించారు. ఉమ్మడి భూముల విభజనకు పరస్పర అంగీకారం, చట్టబద్ధత ఉంటేనే అనుమతించాలని స్పష్టం చేశారు.అభ్యంతరాలు, అప్పీళ్ల విచారణ సమయంలో అదనపు కలెక్టర్, ఆర్డీవోలు క్షేత్రస్థాయి పరిశీలనలు చేయాలని సూచించారు. అన్ని అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాతే సెక్షన్ 13 కింద తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆ తర్వాతే భూభారతి రికార్డుల్లో సవరణలు చేపట్టాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ జిల్లా మినహా మిగిలిన అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు ఈ మార్గదర్శకాలను అమలు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

బాలల ప్రతిభకు బాలోత్సవం వేదిక

- **మార్కులు, ర్యాంకులకే విద్య పరిమితం కాకూడదు**
- **బాలోత్సవ నిర్వహణకు రూ.25 లక్షలు మంజూరు చేసిన మంత్రి జూపల్లి**



హైదరాబాద్,నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవాలు మంచి వేదికగా నిలుస్తాయని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. విద్యను కేవలం మార్కులు, ర్యాంకులకే పరిమితం చేయకుండా విద్యార్థుల్లో కళలు, క్రీడలు, సృజనాత్మకతను ప్రోత్సహించాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీ రమణాచారి అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ బాలల ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాలల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని, మూఢనమ్మకాలకు దూరంగా ఉంచాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. బాలోత్సవ నిర్వహణతోపాటు కళల అభివృద్ధికి సాంస్కృతిక శాఖ తరఫున రూ.25 లక్షలు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులను అక్షరాస్యులుగా మార్చడంతోపాటు సమాజంలోని సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించాలని సూచించారు.విద్య, వైద్యం వ్యాపారంగా మారడం ఆందోళనకరమని, కార్పొరేట్ విద్యా విధానం వల్ల పిల్లలపై ఒత్తిడి పెరుగుతోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పిల్లల్లోని ఆసక్తులు, నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచించారు.రెండు రోజులపాటు జరిగే ఆరో తెలంగాణ బాలోత్సవంలో 25 విభాగాల్లో సుమారు 10 వేల మంది విద్యార్థులు పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సినీ రచయిత సుద్దాల అశోక్‌తేజ, చొక్కాపు వెంకటరమణ, బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎన్.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలి!

- నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవ జిల్లా సదస్సును జయప్రదం చేయండి

ప్రభుత్వాలు మారినా రాజ్యాంగ స్ఫూర్తి మారకూడదు.. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా హక్కుల అమలుకు కృషి చేయాలి

రాజ్యాంగం కల్పించిన సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం ప్రతి పౌరుడికీ అందాలి

తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు, దళితరత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ





ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం నిలవడానికి, ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కల్పించడానికి భారత రాజ్యాంగమే పునాది అని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు, దళితరత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. రాజ్యాంగం కేవలం పుస్తకాల్లో ఉండే అక్షరాల సమాహారం కాదని, అణగారిన వర్గాలకు ఆత్మగౌరవాన్ని, నిరుపేదలకు న్యాయాన్ని, ప్రతి పౌరుడికి సమాన అవకాశాలను అందించే ప్రజాస్వామ్య జీవన మార్గమని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా రాజ్యాంగ మౌలిక విలువలు మారకూడదని, రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి ఒక్కరికీ అందేలా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పటిష్టంగా అమలు చేయాలని ఆయన ఆకాంక్షించారు.ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎంతో దూరదృష్టితో రూపొందించిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. నవంబర్ 26 రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలను స్మరించుకోవడమే కాకుండా, ఆయన అందించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, సామాజిక న్యాయం వంటి విలువలను ఆచరణలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు.రాజ్యాంగం కల్పించిన హక్కులు కాగితాలకే పరిమితం కాకూడదని, సమాజంలోని చివరి వ్యక్తికి సైతం న్యాయం అందినప్పుడే రాజ్యాంగ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. కుల, మత, వర్గ, ఆర్థిక అసమానతలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ అంటే కేవలం దానిని గౌరవించడం మాత్రమే కాదని, అందులో పొందుపరిచిన హక్కులను తెలుసుకోవడం, వాటిని కాపాడుకోవడం, బాధ్యతలను నెరవేర్చడం కూడా అని వివరించారు. అంబేద్కర్‌ను, భారత రాజ్యాంగాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేసినప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా, చట్టపరమైన మార్గాల్లో స్పందించాలని ఆయన అన్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉదయం 9 గంటలకు ఖమ్మం నగరంలోని ఐఎంఏ హాల్‌లో భారత రాజ్యాంగ దినోత్సవ జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్, సంఘం వ్యవస్థాపకులు జన్ను కనకరాజు మాదిగ, రాష్ట్ర నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు.రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, అంబేద్కర్ ఆశయాలను భావితరాలకు అందించడం, ప్రభుత్వాలు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పాలన సాగించేలా ప్రజాస్వామ్య చైతన్యాన్ని బలోపేతం చేయడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రాజ్యాంగ హక్కుల కోసం జరిగే ఈ చైతన్య యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా నలుమూలల నుంచి మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు, సామాజిక ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులను కాపాడుకోవడం మన బాధ్యత.. ఆ హక్కులు ప్రతి ఒక్కరికీ అందేలా చూడటం సమాజం సమష్టి కర్తవ్యం అని ఆయన పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు దుప్పెల్లి శ్రీను మాదిగ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మునగలేటి వీరస్వామి మాదిగ, ఖమ్మం నియోజకవర్గం ఇన్‌చార్జి పిల్లిగుండ్ల ముత్తయ్య మాదిగ, పాలేరు నియోజకవర్గం ఇన్‌చార్జి బొడ్డు గురువయ్య మాదిగ, ఖమ్మం కార్పొరేషన్ ఇన్‌చార్జి రాయల నాగేశ్వరరావు, పాలేరు నియోజకవర్గం కో-ఇన్‌చార్జి కొండా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడు అచ్చ విద్యాసాగర్ మృతి తీరని లోటు

● పెరిక కుల సంఘం, సామాజిక న్యాయ వేదిక నివాళి



వరంగల్ సిటీ, నవంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):తెలంగాణ ఉద్యమకారుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా టిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, పెరిక కుల ముద్దుబిడ్డ అచ్చ విద్యాసాగర్ ఆకస్మిక మృతి పట్ల పెరిక కులస్తులు, పలు ప్రజా సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ప్రొఫెసర్ జయశంకర్ సార్ స్ఫూర్తితో మలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యాసాగర్ ఎంతో చురుకుగా పాల్గొన్నారు. రైలు రోకో, వంటావార్పు వంటి అనేక నిరసన కార్యక్రమాల్లో ముందుండి నడిపించడమే కాకుండా, ఎందరో ఉద్యమకారులను రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దారు. ఉద్యమ సమయంలో ఆర్థికంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా వెనకడుగు వేయకుండా పార్టీ కోసం పనిచేశారని, బీసీ సామాజిక వర్గంలో పెరిక కుల నాయకుడిగా ఎదిగిన ఆయన మరణం తమకు తీరని లోటని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.**కుటుంబ సభ్యులకు పరామర్శ:** విద్యాసాగర్ మరణవార్త తెలుసుకున్న వరంగల్ జిల్లా పెరిక కుల సంఘం, సామాజిక న్యాయ వేదిక నాయకులు ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా పెరిక కుల అధ్యక్షుడు అచ్చ వినోద్ కుమార్, గౌరవాధ్యక్షులు బోలుగోడు శ్రీనివాస్, సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఏషబోయిన సాంబయ్య యాదవ్, రాష్ట్ర ప్రధాన సలహాదారులు కొమ్మినేని భూపాల్ రావు పటేల్, పెరిక కుల నాయకులు శ్రీరామ్ దయానంద్, దిడ్డి కుమారస్వామి, కందిమల్ల మహేష్, బిల్లా రవి, అరసం రాంబాబు, సుంచు జగదీశ్వర్, చింతం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలి

● 2,125 అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి.. నర్సరీ నుంచి యూనివర్సిటీ వరకు ఉచిత విద్య అందించాలి



హైదరాబాద్ జవహర్ నగర్, నవంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్): ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసి, నాణ్యమైన ఉచిత విద్య అందించాలని డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ (డాటా) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 2,125 అధ్యాపక పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరింది.ప్రస్తుతం 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకే అనుమతి ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. అన్ని ఖాళీల భర్తీకి సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ప్రకటించిన రూ.1,000 కోట్లు విడుదల చేయాలని, ప్రతి ప్రభుత్వ విశ్వవిద్యాలయానికి రూ.500 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేసింది.విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని, ప్రైవేటీకరణను నియంత్రించి ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని పేర్కొంది. ప్రైవేటు కళాశాలల అధ్యాపకులకు సమాన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరింది.నర్సరీ నుంచి విశ్వవిద్యాలయం వరకు అందరికీ ఉచితంగా నాణ్యమైన ప్రభుత్వ విద్య అందించాలని డాటా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే విజయాలు సొంతం

మిసెస్ ఇండియా యూనివర్స్ ఎర్త్ 2026' విజేత శృతి జోయ్‌జోడే



హైదరాబాద్, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): మహిళలు తమ కలలను సాకారం చేసుకోవడానికి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే ఏదైనా సాధించవచ్చని 'దివాలిషియస్ మిసెస్ ఇండియా యూనివర్స్ ఎర్త్2026' విజేత శృతి జోయ్‌జోడే అన్నారు. ప్రతిభను నిరూపించుకోవడానికి వయసు గానీ, వివాహం గానీ ఏమాత్రం అడ్డంకులు కావని ఆమె స్పష్టం చేశారు. జైపూర్ వేదికగా 'దివాలిషియస్' సంస్థ, మిసెస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి అందాల పోటీల్లో శృతి ప్రతిష్ఠాత్మక కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం బషీర్‌బాగ్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె తన విజయ విశేషాలను పంచుకున్నారు. ఒకవైపు కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూనే, తనకున్న ఆసక్తి, పట్టుదలతో ఈ విజయాన్ని అందుకున్నట్లు తెలిపారు. నేటి తరం మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా, తమలోని నైపుణ్యాలను గుర్తించి అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. తన ఈ ప్రయాణంలో కుటుంబ సభ్యులు, సమాజ పెద్దలు అందించిన ప్రోత్సాహం మరువలేనిదని కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, మహిళా సాధికారత కోసం తన వంతు కృషి చేస్తానని వివరించారు.జాతీయ వేదికపై విజేతగా నిలిచిన శృతి జోయ్‌జోడేను పలు సంఘాల నేతలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా భావసార క్షత్రియ రంగరేజ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉమేష్ కుమార్ జైతనే మాట్లాడుతూ సమాజంలోని యువత, మహిళలకు శృతి విజయం ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆమె మరిన్ని అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో భావసార క్షత్రియ రంగరేజ్ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీధర్ లోకండే, బీవీఐ అధ్యక్షురాలు అశ్విని పతంగే, భావసార క్షత్రియ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ కార్యదర్శి అశ్విన్ కుమార్ పతంగే, హేమారాణి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ బంధాలు.. మానవీయ విలువల కథాంశమే.. 'నేనూ నా లల్లీ'

- డిసెంబర్ 11న థియేటర్లలో విడుదల.. పోస్టర్ ఆవిష్కరణ, ట్రైలర్ లాంచ్ చేసిన సినీ దర్శకుడు ఎన్ ఎన్ ఆర్ చౌదరి



ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): కుటుంబ విలువలు, మానవ సంబంధాలు, స్వచ్ఛ రాజకీయాల ఇతివృత్తంగా తెరకెక్కిన కుటుంబ కథా చిత్రం 'నేనూ నా లల్లీ' డిసెంబర్ 11న థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని హీరో, నిర్మాత, దర్శకుడు ఎన్ఎన్ఆర్ చౌదరి రూపొందించారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో చిత్ర పోస్టర్‌ను ఆవిష్కరించి ట్రైలర్‌ను లాంచ్ చేశారు.ఈ సందర్భంగా ఎన్ఎన్ఆర్ చౌదరి మాట్లాడుతూ.. కుటుంబ బంధాలు, మానవీయ విలువలు, స్వచ్ఛ రాజకీయాలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని 'నేనూ నా లల్లీ' చిత్రాన్ని నిర్మించినట్లు తెలిపారు. ప్రేక్షకులకు మంచి వినోదంతో పాటు సందేశాన్ని అందించేలా సినిమాను రూపొందించామన్నారు. డిసెంబర్ 11న థియేటర్లలో విడుదల కానున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించి విజయవంతం చేయాలని కోరారు.సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన తాను సినిమాపై ఉన్న ఆసక్తితో హైదరాబాద్‌కు వెళ్లి ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో సినిమా కోర్సు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటికే రెండు చిత్రాలను నిర్మించానని, 'నేనూ నా లల్లీ' తన మూడో చిత్రమని వెల్లడించారు. తక్కువ బడ్జెట్‌తో రూపొందించినప్పటికీ సినిమా నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడలేదని, సినిమాటోగ్రఫీ, సంగీతం, డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకునేలా వచ్చాయని పేర్కొన్నారు. చిత్రంలోని పాటలు మంచి ఆదరణ పొందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం చిత్ర పోస్టర్‌ను ఆవిష్కరించి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు తాతా శ్రీనివాసరావు, ఏపూరి లక్ష్మీనారాయణ, నామా పురుషోత్తం, ఉత్కంఠం శ్రీనివాస్ పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలపై అత్యవసర మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో గళమెత్తిన కార్పొరేటర్ మహ్మద్ మజీద్ హుస్సేన్



కరీంనగర్ నవంబర్ 20(పిసి డబ్ల్యూ న్యూస్): ఈరోజు నిర్వహించిన అత్యవసర మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తన డివిజన్‌కు సంబంధించిన పలు ప్రజా సమస్యలను ఏఐఎంఐఎం కార్పొరేటర్ మహ్మద్ మజీద్ హుస్సేన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా డివిజన్‌లో వీధి కుక్కలు, కోతుల బెడదను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా కుళాయి నీటి నాణ్యత సరిగా లేకపోవడం, లోతట్టు నీటి ట్యాంక్ వద్ద మోటార్ మరమ్మతులు చేపట్టడం, నీటి సరఫరా సమయాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా సవరించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే వర్షపు నీరు నిల్వ ఉండకుండా సరైన పారుదల వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని, డివిజన్‌లో వీధి దీపాల కొరతను పరిష్కరించి అన్ని ప్రాంతాల్లో తగినన్ని వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.ముస్లింలకు సంబంధించిన ఆఖీ సఫర్ కార్యక్రమం నిర్వహణ కోసం కూడా అవసరమైన నిధులు కేటాయించాలని సమావేశంలో ప్రతిపాదించారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి, డివిజన్ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మహ్మద్ మజీద్ హుస్సేన్ ఈ సందర్భంగా కోరారు.

శాతవాహన వర్సిటీకి స్పాట్ కౌన్సెలింగ్

● ఖాళీ సీట్లను భర్తీ చేసి విశ్వవిద్యాలయాన్ని కాపాడాలి: హరిప్రసాద్



కరీంనగర్, నవంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్): శాతవాహన విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు వెంటనే స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. విద్యార్థి జేఏసీ నాయకుడు లింగంపల్లి మహేష్ ఆధ్వర్యంలో ఏడు రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు ఆయన మద్దతు తెలిపారు.విశ్వవిద్యాలయంలో పలు కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భౌతిక శాస్త్రంలో 30 సీట్లకు నలుగురు, గణితంలో 40కి పది మంది, కంప్యూటర్ సైన్స్‌లో 40కి 17 మంది మాత్రమే చేరారని తెలిపారు. ఐటీ కోర్సులో 60 సీట్లకు ఒక్క విద్యార్థి కూడా చేరలేదని పేర్కొన్నారు.ఇంజినీరింగ్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ కోర్సుల మాదిరిగానే మిగిలిన విభాగాల్లోనూ స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. గ్రామీణ విద్యార్థులకు కోర్సులు, సౌకర్యాలపై అవగాహన కల్పించి ప్రవేశాలు పెంచాలని సూచించారు. శాతవాహన విశ్వవిద్యాలయాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యతని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నగర అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్, చంటి శ్రీనివాస్, కుతాడి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బత్తుల రాజు, నాయకులు పాల్గొన్నారు.

రాంకీ డంపింగ్ యార్డు ఎత్తివేతకు నవంబర్ 22 నుంచి రిలే నిరసన దీక్షలు!



● దీక్షలను జయప్రదం చేయాలని పోరాట కమిటీ పిలుపు



జవహర్ నగర్, నవంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్): జవహర్ నగర్ రాంకీ డంపింగ్ యార్డును శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 22 నుంచి చెన్నాపురం ఎన్‌టీఆర్ క్రాస్ రోడ్డులో రిలే నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ప్రకటించింది.ఈ దీక్షలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం బాలాజీనగర్ బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద కమిటీ చైర్మన్ షేక్ షావలి అధ్యక్షతన పోస్టర్ ఆవిష్కరించారు.ఈ నెల 19న ప్రగతినగర్‌లోని నీలం రాంచంద్రయ్య భవన్‌లో జరిగిన జేఏసీ కో-కన్వీనర్ల సమావేశంలో, నవంబర్ 15న వాయిదా పడిన దీక్షలను 22 నుంచి కొనసాగించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ మేకల కావ్య, కార్పొరేటర్ సుబ్రహ్మణ్యం, ఉపసర్పంచ్ నర్సింహ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న విషవాయువుల ప్రభావం చలికాలంలో మరింత తీవ్రంగా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. మీథేన్, హైడ్రోజన్ సల్ఫైడ్, అమ్మోనియా వంటి వాయువులు పొగమంచుతో కలిసి పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని తెలిపారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు, ముఖ్యంగా గర్భిణులు శ్వాసకోశ, గుండె సంబంధిత సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాంకీ గేటు సమీపంలో నివసిస్తున్న 14 ఏళ్ల బాలిక మృతి ఈ పరిస్థితులపై తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, డంపింగ్ యార్డును శాశ్వతంగా తొలగించేందుకు శాస్త్రీయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధిత ప్రాంతాల ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో రిలే దీక్షల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఇప్పటికే మద్దతు ప్రకటించిన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో పాటు ఎంపీ ఈటెల రాజేందర్, అధికార కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ కూడా దీక్షలకు మద్దతు ప్రకటించి బాధిత ప్రజలకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.రిలే దీక్షలను ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా నిర్వహిస్తామని, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించబోమని షేక్ షావలి పోలీసు అధికారులకు స్పష్టం చేస్తూ, వారి సహకారం కోరారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కోశాధికారి, ఐఎఫ్‌టీయూ నాయకుడు పి. శివబాబు, కో-కన్వీనర్లు బీఎస్పీ బిర్రు యాకస్వామి, టీఆర్ఎస్ మేక లలిత యాదవ్, సీపీఐ దర్శనం యాదగిరి, సీహెచ్ దశరథ, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ వి. ప్రవీణ్, సీపీఎం నగేష్, పీఓడబ్ల్యూ (విముక్తి) గడిపే సునీత, పీఓడబ్ల్యూ జయసుధ, డి. స్వరూప, జర్నలిస్ట్ కొన్నె వేణు, పీకేఎం డి. జాన్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ మహ్మద్ పాషామియా, టి. కాలేషా, బహుజన రక్షణ సమితి మహ్మద్ జావేద్, టీవీఐవీ మబ్బుబాలు, శ్రావణ్ కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్





కరీంనగర్ నవంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్): లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో గురువారం వావిలాలపల్లిలోని గౌరిశెట్టి వెంకటయ్య మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో జాతీయ సమైక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు జాతీయ ఐక్యత, మత సామరస్యం, సోదరభావం ప్రాముఖ్యతను వివరించారు. జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే సందేశంతో బి.ఎడ్. విద్యార్థులకు పునర్వినియోగ వస్త్ర సంచులను పంపిణీ చేశారు. విద్యార్థులకు బిస్కెట్లు అందజేశారు.కార్యక్రమానికి సహకరించిన కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మ్యాడం శివకాంత్, బట్టు వినోద్, మెతుకు కె. చైతన్య, సింగమ రాజు, ఐత సూరజ్, కోల అన్నారెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.జాతీయ ఐక్యతతో పాటు పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని క్లబ్ ప్రతినిధులు తెలిపారు.


జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- డిసెంబర్ 9లోగా నిర్ణయం తీసుకోకుంటే సీఎం పర్యటన అడ్డుకుంటాం: తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు షేక్ హుస్సేన్



ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): అర్హులైన జర్నలిస్టులందరికీ ఎలాంటి వివక్ష లేకుండా ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన నగర అధ్యక్షుడు కర్లపూడి రఫీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేపట్టారు . ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు షేక్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టులకు సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడటం బాధాకరమన్నారు . జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని చెబుతున్న ప్రభుత్వాలు ఇళ్ల స్థలాల కేటాయింపులో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు . డిసెంబర్ 9వ తేదీలోగా ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ ప్రారంభించాలని , లేనిపక్షంలో ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు . జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు . జర్నలిస్టుల మద్దతుతో ప్రజల్లో హీరోలుగా చలామణి అవుతున్న వారిని జీరోలుగా మార్చే సత్తా జర్నలిస్టులకు ఉందని వ్యాఖ్యానించారు . న్యాయం జరిగే వరకు జర్నలిస్టుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యదర్శి వనం నాగేంద్ర కుమార్ , బంజారా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ నాయక్ , టీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ యాదవ్ , బంజారా విభాగం జిల్లా అధ్యక్షుడు రాజ్ కుమార్ , నవాజ్ తదితరులు పాల్గొన్నారు .

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు శిబిరాన్ని తనిఖీ చేసిన మాజీ కార్పొరేటర్ అఖిల్ ఫిరోజ్



కరీంనగర్, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): నగరంలోని కళాభారతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రత్యేక నమోదు శిబిరాన్ని 59వ డివిజన్ ముకర్రంపుర మాజీ కార్పొరేటర్ అఖిల్ ఫిరోజ్ సాహిబ్ సందర్శించి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా శిబిరంలో జరుగుతున్న నమోదు ప్రక్రియను, అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్న వివరాలను ఆయన పరిశీలించారు. ఈ పథకం ద్వారా 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల అర్హులైన స్వయం ఉపాధి వ్యక్తులకు జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.**నమోదుకు అవసరమైన పత్రాలు:** 1. ఆధార్ కార్డు2. రేషన్ కార్డు3. మొబైల్ నంబర్4. ప్రస్తుత నివాస చిరునామా వివరాలుఅర్హులైన కుటుంబాలు ఈ ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అఖిల్ ఫిరోజ్ కోరారు. ప్రజలు కరీంనగర్ కళాభారతి మున్సిపల్ కార్పొరేషన్‌లో వార్డు అధికారి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక నమోదు శిబిరాన్ని సందర్శించి, అవసరమైన వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.



బాగ్ అంబర్‌పేట్ డివిజన్ ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడిగా వడగల బన్నీ



అంబర్‌పేట్, నవంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్): పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల పూర్తిస్థాయి కమిటీల నిర్మాణం వేగవంతమైంది. ఇందులో భాగంగా అంబర్‌పేట్ నియోజకవర్గం, బాగ్ అంబర్‌పేట్ డివిజన్‌లో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకుల సమావేశం నిర్వహించారు.ఎంఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి, అంబర్‌పేట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెడిపల్లి రఘువరన్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి, హైదరాబాద్ జిల్లా ఎంఎస్ఎఫ్ ఇన్‌ఛార్జ్ రామరపు శ్రీనివాస్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రామరపు శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ.. మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో 32 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత వర్గీకరణ సాధించుకున్నామని గుర్తు చేశారు. భవిష్యత్ కార్యాచరణను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ జిల్లాలోని ప్రతి డివిజన్, బస్తీ స్థాయిలో విద్యార్థి మరియు ఎంఆర్‌పీఎస్ కమిటీలను పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. త్వరలోనే అంబర్‌పేట్ నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో కమిటీల నియామకాన్ని పూర్తి చేసి, నియోజకవర్గ స్థాయి పూర్తిస్థాయి కమిటీని ప్రకటిస్తామని వెల్లడించారు.అనంతరం బాగ్ అంబర్‌పేట్ డివిజన్ ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడిగా వడగల బన్నీని ఏకగ్రీవంగా నియమించారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు వంగూరి ప్రసాద్ మాదిగ, ఎంఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా కో-ఇన్‌ఛార్జ్ మంద అనిల్ మాదిగ, అంబర్‌పేట్ నియోజకవర్గ ఎంఎస్పీ నాయకులు సాయిని గిరీష్, బస్తీ పెద్దలు మీసాల నర్సింగ్ రావు, పోడేటి వెంకటేశ్వర్లు, గుర్రం ఎల్లయ్య, గుగ్గిళ్ళ సారయ్య, ప్రభు ఆర్య, గుడిపల్లి ప్రేమ్ కుమార్, రాజేష్, జిల్లా ప్రశాంత్, వంగూరి నాని, కందుల చరణ్, మేడే యాదగిరి, మచ్చ సాయి, గాలిపల్లి చరణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'గో సమ్మాన్ అభియాన్'కు కేంద్ర మంత్రులకు ఆహ్వానం

● మర్యాదపూర్వకంగా కలిసిన లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ప్రతినిధి బృందం



న్యూఢిల్లీ, నవంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్): సికింద్రాబాద్‌లోని హాకీ గ్రౌండ్‌లో డిసెంబర్ 11న నిర్వహించనున్న 'గో సమ్మాన్ అభియాన్' కార్యక్రమానికి హాజరుకావాలని కేంద్ర మంత్రులు రామ్‌దాస్ అథవాలే, గజేంద్ర సింగ్ షెకావత్‌లను లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ప్రతినిధి బృందం ఆహ్వానించింది.శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రామ్‌దాస్ అథవాలే, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌లను ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్, అధ్యక్షుడు రిదేశ్ జాగిర్దార్, ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పి.సి. రాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గో-సేవ రంగంలో చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలు, భవిష్యత్ లక్ష్యాలను మంత్రులకు వివరించారు.గో-మాత పట్ల గౌరవం, గో-సంరక్షణ, సమాజంలో గో-సంస్కృతిపై అవగాహన కల్పించడమే 'గో సమ్మాన్ అభియాన్' ప్రధాన ఉద్దేశమని ప్రతినిధులు తెలిపారు. ఈ మహా అభియాన్‌లో దేశవ్యాప్తంగా ఉన్న సాధుసంతులు, గో-భక్తులు, సామాజిక కార్యకర్తలు, పలువురు ప్రముఖులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఇరువురు కేంద్ర మంత్రులు ప్రత్యేకంగా అభినందించి, కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

ఐవీఎఫ్ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి

అండాల అక్రమ సేకరణ, రవాణాపై విచారణ జరపాలి: బండారి శేఖర్

కరీంనగర్, నవంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్): హైదరాబాద్‌లో మహిళల నుంచి అండాలను అక్రమంగా సేకరించి రవాణా చేసిన వ్యవహారంపై వార్తలు వెలువడిన నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలోని అన్ని ఐవీఎఫ్ కేంద్రాలపై తక్షణమే ఆకస్మిక దాడులు, తనిఖీలు నిర్వహించాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు.మహిళల నుంచి అండాల సేకరణకు సంబంధించిన అనుమతులు, సమ్మతి పత్రాలు, వైద్య రికార్డులు, అండాల నిల్వ, రవాణా, వినియోగానికి సంబంధించిన వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. డిజిటల్ ఆధారాలు, ప్రయోగశాల రికార్డులు, సీసీటీవీ దృశ్యాలు, ఆర్థిక



లావాదేవీల వివరాలను చట్టబద్ధంగా భద్రపరిచి విచారణ చేపట్టాలని అన్నారు.కరీంనగర్‌లోని కొన్ని ఐవీఎఫ్ కేంద్రాల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతున్నారనే అనుమానాలున్నాయని ఆయన ఆరోపించారు. సంతానలేమితో బాధపడుతున్న దంపతుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ, అండాల మూలం, దాతల వివరాలు, చికిత్సా విధానంపై తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలితే సంబంధిత వైద్యులు, కేంద్రాల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వో, సంబంధిత ఏఆర్‌టీ నియంత్రణ అధికారులు వెంటనే స్పందించి సమగ్ర తనిఖీలు నిర్వహించాలని కోరారు. అక్రమాలు నిర్ధారణ అయితే కేంద్రాల రిజిస్ట్రేషన్లు, అనుమతులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు బాధ్యులైన వైద్యులపై జాతీయ వైద్య కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల ఆరోగ్యం, గౌరవం, సంతానం కోసం ఎదురుచూస్తున్న దంపతుల ఆశలతో వ్యాపారం చేసే వారిని ఉపేక్షించకూడదని బండారి శేఖర్ ప్రభుత్వాన్ని కోరారు.

శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన




కరీంనగర్ నవంబర్ 20(పిసి డబ్ల్యూ న్యూస్): కరీంనగర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆరోగ్య భారతి తెలంగాణ భాగ్యనగర్ దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి అమినేని కుమారస్వామి విద్యార్థులను ఉద్దేశించి ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత, పోషకాహారం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రతిరోజూ సమతుల్యమైన ఆహారం తీసుకోవడం, ఆకుకూరలు, పండ్లు, పప్పుధాన్యాలు, పాలు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలియజేశారు. అలాగే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పకుండా వ్యాయామం, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆరోగ్యకరమైన జీవనశైలి, పోషకాహారంపై మంచి అవగాహన కలిగించినందుకు పాఠశాల కార్యదర్శి కోల అన్నారెడ్డి, ప్రధానచార్యులు మోర రణధీర్ కృతజ్ఞతలు తెలియచేసారు.

మద్యం మత్తులో పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయుడు..

రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఏటూరునాగారం, నవంబర్ 20: (పిసిడబ్ల్యూ న్యూస్): మద్యం మత్తులో పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయుడిని ఎస్ఎఫ్ఐ నాయకులు రెడ్‌హ్యాండెడ్‌గా గుర్తించిన ఘటన ఏటూరునాగారం మండలం రొయ్యూరు గ్రామంలో చోటుచేసుకుంది.భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రొయ్యూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాగటి రవితేజ మాట్లాడుతూ.. గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ప్రధానోపాధ్యాయుడు పాఠశాల పని వేళల్లో మద్యం సేవించి రావడం బాధాకరమని అన్నారు. థమ్స్ అప్ శీతల పానీయంలో మద్యం కలుపుకొని సేవించిన మత్తులో ఉన్నట్లు గుర్తించామని ఆరోపించారు. దీనిపై ప్రశ్నించిన తమతో ప్రధానోపాధ్యాయుడు అసభ్య పదజాలంతో దురుసుగా మాట్లాడారని తెలిపారు.పాఠశాలను తన సొంత ఇల్లులా భావిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, గతంలోనూ గ్రామస్తులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు రావడం లేదని విమర్శించారు. ఉపాధ్యాయులే బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నించారు.ఏజెన్సీ ప్రాంతంలో విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరారు. ఈ ఘటనపై మండల విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే పాఠశాల వద్ద, విద్యాశాఖ అధికారుల కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆత్కూరి మహేష్, తాటిపల్లి రవితేజ, రిషి తదితరులు పాల్గొన్నారు.



కొండగట్టుకు స్పీకర్ రాక

- చందనోత్సవంలో పాల్గొన్న గడ్డం ప్రసాద్





చొప్పదండి నవంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్): చొప్పదండి నియోజకవర్గ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న స్వామివారి చందనోత్సవం, పశు సంప్రోక్షణ, నిజరూప దర్శన మహోత్సవ వేడుకలకు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ హాజరయ్యారు.శుక్రవారం ఆలయానికి విచ్చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎల్లమ్మ కార్పొరేషన్ చైర్మన్ , వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నరసింగరావులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

పక్షవాతంపై అప్రమత్తతే ప్రాణరక్షణకు మార్గం

అత్యాధునిక స్ట్రోక్ చికిత్సతో మెరుగైన వైద్య సేవలు

మలక్‌పేట్ యశోదా ఆసుపత్రిలో రక్తపు గడ్డను కరిగించే చికిత్సతో పాటు మెకానికల్ థ్రాంబెక్టమీ అందుబాటు

ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్): చేయి, కాలు ఒక్కసారిగా బలహీనపడుతున్నాయా మాట తడబడుతోందా ముఖం ఒకవైపుకు వాలిపోతోందా అయితే నిర్లక్ష్యం చేయవద్దు అవి పక్షవాతం స్ట్రోక్ హెచ్చరిక సంకేతాలు కావచ్చు. స్ట్రోక్ అనేది అత్యవసర వైద్య పరిస్థితి కావడంతో ప్రతి నిమిషం ఎంతో విలువైనదని, లక్షణాలు కనిపించిన వెంటనే బాధితులను సమీపంలోని సమర్థవంతమైన వైద్య సదుపాయాలున్న ఆసుపత్రికి తరలించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల్లో రక్తపు గడ్డ ఏర్పడటం లేదా రక్తనాళం పగిలి రక్తస్రావం జరగడం వల్ల స్ట్రోక్ సంభవిస్తుంది. దీనివల్ల మెదడులోని సంబంధిత భాగానికి ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి మెదడు కణాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. సకాలంలో చికిత్స అందకపోతే శాశ్వత వైకల్యం ఏర్పడే అవకాశం ఉంది.స్ట్రోక్ హెచ్చరిక సంకేతాలు శరీరంలో ఒకవైపు అకస్మాత్తుగా బలహీనత లేదా తిమ్మిరి రావడం, మాట్లాడటంలో ఇబ్బంది, ముఖం ఒకవైపు వాలిపోవడం, కంటిచూపు మందగించడం, తలతిరగడం, శరీర సమతుల్యత కోల్పోవడం వంటి లక్షణాలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా సబ్ అరాక్నాయిడ్ హెమరేజ్ అనేది మెదడు చుట్టూ ఉన్న పొరల మధ్య రక్తస్రావం జరిగే ప్రమాదకరమైన స్ట్రోక్ రకం. బ్రెయిన్ అన్యూరిజం దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి అలాగే కరోటిడ్ ఆర్టరీల్లో రక్తనాళాల అడ్డంకులు ఏర్పడితే మెదడుకు రక్తప్రసరణ తగ్గి స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుంది. అవసరాన్ని బట్టి వైద్యుల సూచనల మేరకు స్టెంటింగ్ వంటి చికిత్సలతో రక్తప్రసరణను



మెరుగుపరిచే అవకాశం ఉంటుంది.అధునాతన వైద్యంతో మెరుగైన ఫలితాలు హైదరాబాద్ మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యాధునిక స్ట్రోక్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. సకాలంలో పరీక్షలు నిర్వహించి స్ట్రోక్ రకాన్ని గుర్తించడం, అవసరమైన రోగులకు రక్తపు గడ్డను కరిగించే థ్రాంబోలైసిస్ మందులు అందించడం, ఎంపిక చేసిన ఇస్కీమిక్ స్ట్రోక్ రోగులకు మెకానికల్ థ్రాంబెక్టమీ చికిత్స నిర్వహించడం వంటి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపాయి.మెకానికల్ థ్రాంబెక్టమీ అనేది అత్యాధునిక, అతి తక్కువ కోతతో చేసే న్యూరోఇంటర్వెన్షనల్ చికిత్స. ఇమేజింగ్ సాంకేతికత సహాయంతో ప్రత్యేక పరికరాలను రక్తనాళాల ద్వారా మెదడులోని అడ్డంకి ఏర్పడిన ప్రాంతానికి చేర్చి రక్తపు గడ్డను తొలగిస్తారు. తద్వారా మెదడుకు రక్తప్రసరణను పునరుద్ధరించే అవకాశం ఉంటుంది. సరైన రోగులకు తగిన సమయంలో ఈ చికిత్స అందిస్తే కోలుకునే అవకాశాలు మెరుగుపడతాయని వైద్యులు వివరిస్తున్నారు.వైద్య నిపుణుల సూచనలు కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ భరత్ కుమార్ సూరిశెట్టి మాట్లాడుతూ స్ట్రోక్ అత్యవసర వైద్య పరిస్థితి అని, ఇందులో ప్రతి నిమిషం కీలకమని తెలిపారు. లక్షణాలను ముందుగానే గుర్తించి బాధితులను వెంటనే ఆసుపత్రికి తీసుకురావడం ద్వారా మెదడుకు జరిగే నష్టాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. పరీక్షల అనంతరం స్ట్రోక్ రకాన్ని బట్టి రక్తపు గడ్డను కరిగించే మందులు లేదా అధునాతన చికిత్సలను ఎంపిక చేస్తామని వివరించారు.కన్సల్టెంట్ న్యూరో అండ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ సంకేత్ దాస్ మాట్లాడుతూ మెకానికల్ థ్రాంబెక్టమీ వంటి అధునాతన విధానాలు తీవ్రమైన ఇస్కీమిక్ స్ట్రోక్‌తో బాధపడుతున్న ఎంపిక చేసిన రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. న్యూరాలజిస్టులు, న్యూరోఇంటర్వెన్షనల్ నిపుణుల సమన్వయంతో సకాలంలో చికిత్స అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వివరించారు.ఆసుపత్రి యాజమాన్యం విజ్ఞప్తి మలక్‌పేట్ యశోదా ఆసుపత్రిలో ప్రత్యేక నాడీ సంబంధిత వైద్య సేవలతో పాటు మెకానికల్ థ్రాంబెక్టమీ వంటి అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు. పక్షవాతం లక్షణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, లక్షణాలు కనిపించినప్పుడు ఇంటి చిట్కాలు, స్వీయ వైద్యం లేదా ఆలస్యం చేయకుండా వెంటనే వైద్య సహాయం పొందాలని ప్రజలకు సూచించారు.

జాంబవవారసుల సేవా సమితికి అవార్డు





ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్):గత దశాబ్ద కాలంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జాంబవవారసుల సేవా సమితి ద్వారా నిరుపేద విద్యార్థులకు మరియు నిరుపేద అనారోగ్య బాధితులకు చేయూత అందించటమే కాకుండా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి సేవలందిస్తున్న జాంబవవారసుల సేవా సమితి అధ్యక్షుడు పేరెల్లిశ్రీనివాస్ ను యంగ్ లీడర్షిప్ అవార్డు -2026 కి ఎంపికచేసి ఖమ్మం లోని భక్తరామదాసు కళాక్షేత్రం లో జరిగిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం లో రైట్ ఛాయిస్ అధినేత మెండెం కిరణ్ కుమార్ మరియు ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ఎర్రబెల్లి రజనీకాంత్ చేతుల మీదుగా సన్మానించి అవార్డు అందజేయటం జరిగింది. కార్యక్రమంలోకిన్నెరవెంకటేశ్వర్లుబొజ్జ గంగన్న, మాతంగి జయరాం, మంచాల వేణు, చేకూరి చైతన్య, మరికంటి కన్నారావు, కేదాస్ కృష్ణ, పెనుగూరి కోటేశ్వరరావు, యడెల్లి వెంకట్, దాసరి రాజశేఖర్, పరిమళ రాము లతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు చెత్తబుట్టలు కాదని చాటిచెప్పిన 'డస్ట్ బిన్స్' నాటిక





హైదరాబాద్, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్):నేటి తరం యువతీ యువకుల ఆలోచనా విధానానికి అద్దం పడుతూ, తల్లిదండ్రుల విలువను చాటిచెప్పిన 'డస్ట్ బిన్స్' నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆలోచింపజేసింది. కిన్నెర ఆర్ట్స్ వార్షికోత్సవాల సందర్భంగా చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో 'శ్రీ జయా ఆర్ట్స్ హైదరాబాద్' సంస్థ ఆధ్వర్యంలో ఈ నాటికను ప్రదర్శించారు.మద్దాళి ఉషా గాయత్రి అందించిన మూలకథకు శ్రీజ సాదినేని నాటకీకరణ చేసి, దర్శకత్వం వహించడమే కాకుండా ఇందులో ముఖ్య పాత్రలో నటించి మెప్పించారు. తల్లిదండ్రుల గొప్పతనాన్ని వివరిస్తూ నాటికలో వచ్చిన సంభాషణలు ప్రేక్షకులతో చప్పట్లు కొట్టించాయి. నాటిక అనంతరం నిర్వాహకులు శ్రీజ సాదినేనిని ఘనంగా సత్కరించారు.ఈ నాటికలో శ్రీజ సాదినేనితో పాటు కృష్ణ, అఖిల్, ఇందు, జి. నాగేశ్వర రావు, బాషా తదితరులు కీలక పాత్రల్లో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.

వైద్య సేవలకు ఆదర్శం డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్

ఖమ్మం ఐఎంఏ హాల్‌లో విగ్రహావిష్కరణ





ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్): వైద్య సేవల్లో మానవత్వం, సేవాభావానికి ప్రతిరూపం భారతరత్న డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ అని వైద్య ప్రముఖులు కొనియాడారు. ఖమ్మం నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాల్‌లో గురువారం సాయంత్రం ఆయన విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. వైద్య వృత్తిని మానవ సేవకు గొప్ప మార్గంగా భావించిన డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ ప్రజారోగ్య అభివృద్ధికి, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు విశేష కృషి చేశారని తెలిపారు. ఆధునిక వైద్యంతో పాటు రోగుల పట్ల మానవీయ విలువలు, ఆత్మీయత, సేవాభావం కూడా ముఖ్యమని పేర్కొన్నారు.విగ్రహ ఏర్పాటుకు సహకరించిన దాతలు డాక్టర్ పాపూరి రాంబాబు, డాక్టర్ సబితలను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వి. విజయ్ కుమార్, ఖమ్మం ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కురపాటి హరి ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ ముక్కపాటి కోటేశ్వరరావు, కోశాధికారి డాక్టర్ కురపాటి ప్రీతి, రాష్ట్ర నాయకులు డాక్టర్ పి. కిషన్, డాక్టర్ సంజీవ్ సింగ్ యాదవ్, డాక్టర్ పి. కాళి ప్రసాద్, డాక్టర్ టి.వి. శ్రీనివాస్, డాక్టర్ డి. శేఖర్ రెడ్డి, డాక్టర్ కె. నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ ఉన్న కోర్సులతో యువతకు ఉపాధి

- నైపుణ్య శిక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,నవంబర్ 20 (పిసిడబ్ల్యూన్యూస్): మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన టాస్క్ కేంద్రాన్ని, రంగంపల్లిలోని బస్తీ దవాఖానాను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా శిక్షణ కోర్సులు రూపొందించాలని సూచించారు. టాస్క్ కేంద్రం ద్వారా మరింత మంది యువతకు ప్రయోజనం కలిగేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.అనంతరం బస్తీ దవాఖానాను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల లభ్యతపై వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజన్ మారుతున్న నేపథ్యంలో జ్వరాల కేసులు పెరిగే అవకాశం ఉన్నందున అవసరమైన మందులను ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో టాస్క్ ప్రాంతీయ మేనేజర్ కౌసల్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

2వేలకు పైగా కొలువులతో నేడు 'మెగా జాబ్ మేళా'

- నిరుద్యోగ యువతకు ఉద్యోగ భరోసా కల్పించడమే లక్ష్యం
- మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి
- యువత ముంగిటకే 20కి పైగా దిగ్గజ కంపెనీలు
- జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించిన ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్



పెద్దపల్లి,నవంబర్ 20 (పిసి డబ్ల్యూన్యూస్): ఉద్యోగ అన్వేషణ కోసం హైదరాబాద్ వంటి మహానగరాలకు వెళ్లే పనిలేకుండా,స్థానిక యువత ముంగిటకే దిగ్గజ కంపెనీలను తీసుకువస్తున్నామని పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో,ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి సౌజన్యంతో శనివారం నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను శుక్రవారం కళాశాల సిబ్బందితో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా జాబ్ మేళాలు నిర్వహిస్తూ,నిరుద్యోగులకు ఉపాధి కల్పించడాన్ని ట్రినిటీ విద్యాసంస్థలు ఒక సామాజిక బాధ్యతగా తీసుకున్నాయని అభినందించారు.పెద్దపల్లి నియోజకవర్గ చరిత్రలోనే తొలిసారిగా 20కి పైగా మల్టీనేషనల్ కంపెనీలు ఒకే వేదికపైకి వచ్చి, 2 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించడం విశేషమన్నారు.గతంలో దాసరి మనోహర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనూ ప్రత్యేక కోచింగ్ ఇప్పించి, దాదాపు 3 వేల మంది యువతకు ఆర్మీ,ఇతర రక్షణ దళాల్లో ఉద్యోగాలు వచ్చేలా కృషి చేశారని గుర్తుచేశారు.ఉద్యోగం అంటే కేవలం వ్యక్తిగత ఉపాధి మాత్రమే కాదని,ఒక కుటుంబానికి ఆర్థిక భరోసా అని ఆమె అన్నారు.యువత తమ భవిష్యత్తు కోసం ఒక్క ముందడుగు వేస్తే, వారికి అండగా నిలిచేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూలకు హాజరై విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఇంతటి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డికి,చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.**నేడే మెగా జాబ్ మేళా** పెద్దపల్లి ప్రగతి నగర్‌లోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం (నవంబర్ 21) ఉదయం 9 గంటల నుండి మెగా జాబ్ మేళా ప్రారంభమవుతుంది.అండర్ గ్రాడ్యుయేట్లు,గ్రాడ్యుయేట్లు,పోస్ట్ గ్రాడ్యుయేట్లుతదితర అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటా మరియు సర్టిఫికెట్లతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్,ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేష్,అడ్మిన్ ఆఫీసర్ సురేష్,రాజిరెడ్డి,చొప్పరి వంశీ, ప్రభాకర్,డాక్టర్ ఆరిఫ్,ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ భవిత,స్వాతి, అశోక్,లక్ష్మి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమి పూజ





కల్లూరు, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :
కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో నగర అభివృద్ధి నిధుల కింద చేపట్టనున్న నూతన సీసీ రోడ్లు మరియు డ్రైనేజీ నిర్మాణ పనులు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, 8వ వార్డు కౌన్సిలర్ లక్కినేని రఘు, మరియు మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణారెడ్డి హాజరయ్యారు. ముందుగా వారు శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. 8వ వార్డు ప్రజల చిరకాల కోరికైన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణంతో స్థానికులకు రవాణా మరియు పారిశుద్ధ్య సమస్యలు తీరనున్నాయని పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్ యాసా నాగమణి శ్రీకాంత్, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలు.. విద్యార్థులకు ఎమ్మెల్యే శంకర్ పిలుపు

- విద్యార్థుల ప్రతిభకు గ్రంథాలయ వేదిక.. విజేతలకు ఘన సత్కారం
- విజ్ఞాన వెలుగులు పంచిన 59వ గ్రంథాలయ వారోత్సవాలు.. ఘనంగా ముగింపు వేడుకలు



షాద్ నగర్, నవంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ గ్రేడ్-1 శాఖా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 59వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారం రోజులపాటు నిర్వహించిన వారోత్సవాల్లో భాగంగా తాలూకాలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు చదరంగం, పీస్ ఫొటోగ్రఫీ, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని, దానిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పట్టుదల, క్రమశిక్షణ, దృఢ సంకల్పంతో ముందుకు సాగితే లక్ష్యాలను సాధించవచ్చన్నారు. పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని, గ్రంథాలయాల్లోని విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయ అభివృద్ధికి, భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మదన్ మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్లు నక్క బాలరాజ్ యాదవ్, సి. వీరేష్, ప్రధాన కార్యదర్శి క్యూసెట్ శ్రీనివాసులు, మీడియా ఆర్గనైజర్ అల్వాల దర్శన్ గౌడ్, జాయింట్ సెక్రటరీ జూపల్లి చంద్రశేఖర్, కోశాధికారి నీళ్ల రవీందర్ గౌడ్, సంయుక్త కోశాధికారి కత్తి చంద్రశేఖర్ అప్ప, చదరంగం మాస్టర్ వానరసి జగన్, కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, గ్రంథాలయ పాఠకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






నెట్ బాల్ క్రీడలో రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉప్పల్ బాలికల పాఠశాల విద్యార్థులు





కమలాపూర్ నవంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం లోని ఉప్పల్ బాలికల పాఠశాల విద్యార్థులు,హనుమకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం లో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో అండర్ 14,అండర్ 17 నెట్ బాల్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఉప్పల్ బాలికల పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు వి వాణి తెలిపారు.అండర్ 17 లో పసుల సంజీవ్,అండర్ 14 లో ఎస్.కె రెహాన్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారనితెలిపారు.రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను కమలాపూర్ మండల విద్యాధికారి కె శ్రీధర్,కార్యదర్శి కె బి కిరణ్ పిడి,పాఠశాల ఉపాధ్యాయ బృందం,విద్యార్థిని విద్యార్థులు,గ్రామ ప్రజలు తదితరులు అభినందించారు.

స్వాతంత్ర సమరయోధుడు ఆడెపు ఉపేందర్ సంస్మరణ సభ



కమలాపూర్ నవంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో కమలాపూర్ మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు బొప్ప శివశంకర్ అధ్యక్షతన పద్మశాలి ఆత్మబంధువు స్వాతంత్ర సమరయోధుడు,చేనేత ముద్దుబిడ్డ ఆడెపు ఉపేందర్ సంస్మరణ సభ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కమలాపూర్ మాజీ ఏఎంసీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ మాట్లాడుతూ ఆడెపు ఉపేందర్ 20 సంవత్సరాల సుదీర్ఘకాలం చేనేత సంఘం అధ్యక్షులుగా,ఆప్కో జిల్లా డైరెక్టర్ గా,మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేసి చేనేత రంగానికి ఎనలేని సేవలు చేసినారని,చేనేత రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చి తనదైన ముద్రవేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు ఆడెపు శ్రీకాంత్,డాక్టర్ బైరి మల్లికార్జున్,తౌటం రవీందర్, బిజెపి నాయకులు తుమ్మ శోభన్ బాబు,దాసి శంకరయ్య,చేనేత సంఘ కార్యవర్గ సభ్యులు క్యాతం రవీందర్,మెండు రాంబాబు, చేరాల సారంగం,బైరి సహదేవ్ చేరాల వెంకట్రాంజం,సామల దామోదర్,పోరండ్ల కుమారస్వామి,నామని రమేష్, తుమ్మ సదానందం,ఆడెపు ఉపేందర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హుజురాబాద్ లో శ్రీలక్ష్మిగణపతి విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ట



హుజురాబాద్ నవంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మున్సిపాలిటీ లోని 14 వ వార్డులో శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి,హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు,మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు 14వ వార్డు భక్తులను ప్రజలను అభినందించారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు,ప్రజా ప్రతినిధులు భక్తులు వార్డు ప్రజలు మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం





కల్లూరు, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, కమిషనర్ సాయి కృష్ణారెడ్డి ఘనంగా ప్రారంభించారు. 3వ వార్డు కౌన్సిలర్ దాసరి సుధారాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే ప్రభుత్వం ఈ బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. అనంతరం వార్డు ప్రజలకు పథకం యొక్క ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు, కౌన్సిలర్ భూక్య రాంబాయి, యాసా నాగమణి శ్రీకాంత్, జిల్లెల్ల స్వాతి భాస్కర్ రెడ్డి, రాజబోయిన శ్రీను, ఆళ్లకుంట నరసింహ రావు, నోటి కృష్ణారెడ్డి, దోసపాటి శ్రీను, తురబలి, బాల, విజయరావు, వెంకటేశ్వరావు, మట్టా రామకృష్ణ, రవికుమార్, ఉపేందర్, సుబ్బారావు స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

కొత్తపల్లి ఆస్తి పన్ను తగ్గింపునకు తీర్మానం

- ప్రజలపై అదనపు భారం పడకుండా చర్యలు తీసుకోవాలి



కరీంనగర్, నవంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన కొత్తపల్లి పరిధిలోని 17, 18 డివిజన్లలో ఆస్తి పన్ను తగ్గింపునకు కౌన్సిల్ తీర్మానం ఆమోదించింది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్వహించిన అత్యవసర కౌన్సిల్ సమావేశంలో కొత్తపల్లి కార్పొరేటర్లు వాసాల రమేష్, వేముల కవిత చంద్రశేఖర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. కొత్తపల్లి ప్రజలపై అదనపు పన్నుల భారం పడకుండా ప్రస్తుత ఆస్తి పన్నులను తగ్గించాలని కోరుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. తీర్మాన ప్రతిని మున్సిపల్ కమిషనర్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు పంపించి, తదుపరి హైదరాబాద్‌లోని సీడీఎంఏ, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శికి తుది ఆమోదం కోసం పంపించనున్నారు. ప్రభుత్వ ఆమోదం లభిస్తే 17, 18 డివిజన్ల ప్రజలకు ఆస్తి పన్ను తగ్గింపుతో ఊరట కలగనుంది.

మాశెట్టిపల్లిలో పుస్తెమెట్టల అందజేత

- పాలు పోసే రైతు కుటుంబానికి అండగా పాల కేంద్రం



రామడుగు నవంబర్ 20(పిసిడబ్ల్యూ న్యూస్): మా శెట్టిపల్లి గ్రామంలోని పాల కేంద్రం ఆధ్వర్యంలో పుస్తెమెట్టల అందజేత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.మా శెట్టిపల్లి గ్రామంలోని పాల కేంద్రానికి నిత్యం పాలు పోస్తూ పాల కేంద్రం అభివృద్ధికి సహకరిస్తున్న మాడిశెట్టి రవి, సుజాత వారి కుటుంబంలోని కుమార్తె కళ్యాణానికి పుస్తెమెట్టలు అందజేశారు.పాల ఉత్పత్తిదారులే పాల కేంద్రానికి వెన్నెముక అని, వారి కుటుంబంలో జరిగే ప్రతి శుభకార్యంలో పాల కేంద్రం అండగా ఉంటుందని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. రైతులు పాలు పోయడం వల్లనే కేంద్రం దినదినాభివృద్ధి చెందుతోందని, వారికి తగిన ప్రోత్సాహం, సహకారం అందించడం తమ బాధ్యత అని అన్నారు.పుస్తెమెట్టలు అందుకున్న కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. తమ కుమార్తె పెళ్లికి పాల కేంద్రం తరపున అండగా నిలిచి పుస్తెమెట్టలు అందజేయడం చాలా సంతోషంగా ఉందని, పాల కేంద్రం నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు నిర్వాహకులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డెయిరీ మేనేజర్ సుధాకర్, సూపర్ వైజర్ రాజకుమార్ మరియు ప్రెసిడెంట్ మాడిశెట్టి మహేందర్ మరియు పాల వర్గ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈ తల్లి గోస వర్ణనాతీతం?

- తల్లికి ఇద్దరు తనయులు అంగవైకల్యులే
- తల్లి లేనిదే వారికి జీవితం లేదు?
- అయ్యలారా, అయ్యలారా మా పరిస్థితిని చూసి మీకు తోచిన ఆర్థిక సహాయాన్ని చేయండి





తొర్రూరు ప్రతినిధి,నవంబర్ 20 (పిసి డబ్ల్యూన్యూస్): అమ్మలారా, అయ్యలారా కొంగు చాచి మీ ఆర్థిక సహాయాన్ని కోరుతున్న అంటుంది ఆ తల్లి . ఈ దంపతులకు జన్మించిన ఇద్దరు తనయులు 100% అంగవైకల్యులే. ఏనాడు చేసుకున్న పాపము తెలియదు కానీ ఆ తల్లి చేస్తున్న సేవలకు ఎవరికైనా కన్నీరు రాక మానదు. విషయానికి వస్తే మహబూ బాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని అరిపిరాల గ్రామానికి చెందిన తలారి రజిత, రామ్మూర్తి దంపతులకు ఒక కూతురు ,ఇద్దరు తనయులు 100% అంగవైకల్యంతో జన్మించారు. తనయులకు ఇప్పుడున్న వయసు ఒకరి 23,ఎక్కొక్కరికి 19,సంవత్సరాలు అన్ని తానే చూసుకుంటున్న ఆ తల్లి బాధ వర్ణనాతీతం. చిన్నప్పటినుండి వాళ్ళ అమ్మ అన్నం తినిపించడం, టాయిలెట్, బాత్రూం మంచంలోనే పోవటం వాళ్ళ అమ్మ లేనిదే వారికి జీవితం అనేదే లేదు. అన్నం తినిపించడం ,మంచినీళ్లు తాగించడం కను సైగలోనే కంటికి రెప్పలాగా కాపాడుకుంటున్న తల్లి రజిత మా పరిస్థితిని గమనించి ఎవరైనా ఆర్థిక సహాయం చేయాలనుకున్నవారు 9491008499 ఈ నెంబర్ ని సంప్రదించండి. అంగవైకల్యం పూర్తి స్థాయిలో ఉన్న కుమారులకి వారికి ఉపాధి లేక ప్రతిరోజు 24 గంటలు వారికే సేవలందించుతున్నారు. ఎవరైనా దాతలు ఉంటే వీరికి ఆర్థికపరంగా సహాయం చేయాలనుకుంటే మీరు ఏదైనా సహాయము చేస్తే ఇంటి దగ్గర ఏదైనా సొంత వ్యాపారం చేయాలను కుంటున్నారు. మీరు పరోక్షంగా, ప్రత్యక్షంగా ఎవరైనా దాతలు ముందుకు వస్తే ఈ నెంబర్ ని సంప్రదించగలరు, గత సంవత్సరంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వీళ్ళ ఇబ్బందిని చూసి వీరికి అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పడం జరిగిం ది ,కిరాణా షాపు పెట్టిస్తానని హామీ హామీ కూడా ఇచ్చారు. మన హరిపిరాల గ్రామంలో ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులు వీరి పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వీరికి పూర్తి పరిష్కారం చూపించవలసిందిగా కోరుతున్నారు . గ్రామంలో10వ వార్డ్ తలారి కాలనీ అంబేద్కర్ యూత్ అధ్యక్షులు మధువన్ వారి కమిటీ తరపున ఆర్థిక సహాయం చేయడం జరుగుతుంది. గ్రామ నాయకులు ,ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి బాధితులకు తగిన న్యాయం చేసే విధంగా చూడాలని గ్రామస్తులు కొందరు కోరుతున్నారు.

బస్వాపురంలో 11వందల ఎకరాలు రీ-సర్వే పనులు పూర్తి

- రీ-సర్వే ద్వారా భూ రికార్డుల్లో ఖచ్చితత్వం, పారదర్శకత, రైతులకు అవగాహన కల్పించిన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్




తల్లాడ, నవంబర్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :మండలంలో బస్వాపురం గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనులు 11 వందలు ఎకరాలు పూర్తి అయ్యాయని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో ముఖాముఖి మాట్లాడి రీ-సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించారు.బస్వాపురం గ్రామానికి సంబంధించిన మొత్తం భూ విస్తీర్ణం 1,308 ఎకరాల 36 గుంటలు కాగా, ఇప్పటివరకు సుమారు 1,100 ఎకరాల భూమిలో రీ-సర్వే పనులు పూర్తయ్యాయని, మిగిలిన భూముల సర్వేను మరో 2 నుంచి 3 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ, రీ సర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణాలను ఖచ్చితంగా నిర్ధారించి భూ రికార్డులను పారదర్శకంగా, సమగ్రంగా నవీకరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. భూ యజమానుల హక్కుల పరిరక్షణ, భూ రికార్డుల్లో ఖచ్చితత్వం, భవిష్యత్తులో భూ వివాదాల నివారణ, భూములకు సంబంధించిన వివరాల స్పష్టత సాధించడంలో రీ సర్వే కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. రీ సర్వే ప్రక్రియలో రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలు, భూ హద్దుల గుర్తింపులో సర్వే బృందాలకు సహకరి ంచాలని, ఎలాంటి సందేహాలు లేదా సమస్యలు ఉన్నా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచి ంచారు. గ్రామంలో రీ సర్వే పనులను నిర్దేశిత గడు వులో పూర్తి చేసి, రైతులకు ప్రయోజనం చేకూరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

- ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించిన మండల ప్రత్యేక అధికారి సుమన్ చక్రవర్తి, ఎంపీడీవో చంద్రశేఖర్



కల్లూరు, నవంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్) :కల్లూరు మండలంలోని తెలగారం, తాళ్లూరు, చెన్నూరు, నారాయణపురం గ్రామపంచాయతీల లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి సుమన్ చక్రవర్తి, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పథకానికి సంబంధించిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన కుటుంబాలకు ఈ పథకం ద్వారా భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఆన్‌లైన్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు గ్రామ సర్పంచ్ జినుగు శ్రీనివాసరావు, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మున్సిపల్ సమావేశం

- సమావేశంలో సూచనలు అందించిన కార్పొరేటర్ అతీఫ్ అతీనా



కరీంనగర్, నవంబర్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ నగరంలో పారిశుధ్య పనుల మెరుగుదల, ఆస్తి పన్నుల తగ్గింపు, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించేందుకు మేయర్ కె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఏఐఎంఐఎం కరీంనగర్ టౌన్ అధ్యక్షుడు, 61వ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ అతీఫ్ (అతీనా) పాల్గొని నగర అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, పన్నుల తగ్గింపు, మౌలిక సదుపాయాల కల్పనపై పలు సూచనలు చేశారు. ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.కరీంనగర్ సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అతీఫ్ అతీనా సూచించారు.



విజయ్ సేతుపతి రూట్లో నస్లెన్

'ప్రేమలు'లో అమాయకమైన లవర్ బాయ్‌గా కనిపించిన నస్లెన్ ఇప్పుడు సూర్యకే విలన్‌గా మారిపోయారు. 'సీన్' సినిమాలో ఈశ్వరన్ పాత్రతో తనలోని మరో యాంగిల్ చూపించారు. అంతకుముందు 'లోకా'లో కళ్యాణి ప్రియదర్శన్‌తో కలిసి నటించారు. ఇప్పుడు 'బ్యాచిలర్ పార్టీ డ్యూక్స్'లోనూ పెద్ద తారాగణంతో స్క్రీన్ షేర్ చేసుకున్నారు. హీరోగా మంచి క్రేజ్ వచ్చినా సోలో సినిమాల కోసమే ఎదురుచూడకుండా ఇలా విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటున్న తీరు చూస్తుంటే విజయ్ సేతుపతి గుర్తుకొస్తున్నారు. విజయ్ సేతుపతి కూడా తన కెరీర్‌లో హీరో పాత్రలకే పరిమితం కాలేదు. '96'లో ప్రేమికుడిగా మెప్పించిన ఆయన 'విక్రమ్ వేద', 'మాస్టర్', 'విక్రమ్', 'జవాన్' సినిమాల్లో నెగెటివ్ పాత్రలతో అదరగొట్టారు. మరోవైపు 'మహారాజ'తో సోలో హీరోగానూ భారీ విజయం అందుకున్నారు. స్టార్ హీరోలతో కలిసి నటించడానికి ఎప్పుడూ వెనకాడలేదు. పాత్ర నచ్చితే తన ఇమేజ్ గురించి పెద్దగా పట్టించుకోకుండా సినిమాలు చేయడం సేతుపతికి బాగా కలిసొచ్చింది. ఇప్పుడు నస్లెన్ కూడా దాదాపు అలాంటి రూట్‌లోనే వెళ్తున్నారు. 'ప్రేమలు'తో యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించిన తర్వాత వరుస ప్రేమకథలు చేసే అవకాశం ఉన్నా, సూర్య 'సీన్'లో సైకో కిల్లర్ పాత్రకు ఓకే చెప్పారు. దర్శకుడు జీతూ మాధవన్ కూడా నస్లెన్ లాంటి యంగ్ హీరో ఈ పాత్రకు అంగీకరిస్తారా అని మొదట అనుకున్నారట. కానీ నస్లెన్ తన కొత్త ఇమేజ్‌ను వదిలి ఇంత డార్క్ క్యారెక్టర్ చేయడం విశేషం. అయితే విజయ్ సేతుపతి జర్నీలో నస్లెన్ నేర్చుకోవాల్సిన మరో విషయం కూడా ఉంది. ఒక దశలో సేతుపతికి విలన్ ఆఫర్లు ఎక్కువయ్యాయి. స్టార్ హీరోల సినిమాల్లో తన సన్నివేశాలు ఎడిటింగ్‌లో తగ్గిపోయిన సందర్భాలున్నాయని కూడా చెప్పారు. దీంతో కొంతకాలం విలన్ పాత్రలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. నస్లెన్ కూడా వరుసగా పెద్ద హీరోల సినిమాల్లో విలన్ పాత్రలు చేస్తే, హీరోగా సంపాదించుకున్న గుర్తింపు కంటే నెగెటివ్ క్యారెక్టర్లకే డిమాండ్ పెరిగే ఛాన్స్ ఉంది.

పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన సమంత..



ప్రముఖ నటి సమంత మాతృత్వపు మధురిమలను ఆస్వాదిస్తున్నారు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని సమంత, ఆమె భర్త, ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరు స్వయంగా సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు.బాబు చిన్ని వేళ్లు సమంత వేలిని పట్టుకున్న అపురూపమైన చిత్రాన్ని పంచుకుంటూ తమ కుమారుడి పేరును 'దేవ్ నిడిమోరు'గా ఖరారు చేసినట్లు ప్రకటించారు. 2026 నవంబరు 19న తమ బాబు జన్మించాడని, ఈ సమయం తమ జీవితంలోనే అత్యంత ఆనందకరమైన క్షణమని ఈ జంట భావోద్వేగంతో రాసుకొచ్చారు.బాబు రాకకు ముందే, నవంబరు 17న వీరి ఇంట్లో కుటుంబ సభ్యుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. తల్లీబిడ్డల ఆరోగ్యం, సుఖ ప్రసవం కోసం 'మాతృ శిశు మంగళ ఆశీర్వాదం' పేరుతో వేడుక జరిగింది. ఈ పూజలో సమంత ఎరుపు రంగు సాంప్రదాయ దుస్తుల్లో మెరవగా, రాజ్ క్రీమ్ కలర్ కుర్తా, తెల్లటి పైజామాలో కనిపించారు. కుటుంబ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటూ, శ్రీసూక్తం, గాయత్రీ దేవి హోమంలో వారు పాల్గొన్నారు.ఈ వేడుక విశేషాలను రాజ్ సోదరి సోషల్ మీడియాలో పంచుకున్నారు. కుటుంబంలోని పిన్నమ్మలు, పెద్దమ్మలు అందరూ ఒకచోట చేరి సమంతకు, పుట్టబోయే బిడ్డకు దీవెనలు అందించారని ఆమె పేర్కొన్నారు. పద్మశ్రీ శోభారాజు ప్రత్యేకంగా స్వరపరిచిన గీతాన్ని కుటుంబ సభ్యులు ఆలపించి వేడుకను మరింత ఘనంగా మార్చారు.సమంత, రాజ్‌లు 2025 డిసెంబరు 1న కోయంబత్తూరులోని ఇషా యోగా సెంటర్ లింగ భైరవి ఆలయంలో అత్యంత సన్నిహితుల మధ్య వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ', 'మా ఇంటి బంగారం' వంటి చిత్రాల్లో వీరిద్దరూ కలిసి పనిచేశారు. ఆ తర్వాత 2026 జూన్‌లో తాను గర్భవతినన్న విషయాన్ని వెల్లడించిన సమంత, 'మా ఇంటి బంగారం' చిత్రం అనంతరం ప్రసవం కోసం నటన నుంచి విరామం తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఇప్పుడు బాబు రాకతో ఆ ఇంట్లో పండగ వాతావరణం నెలకొంది.

ఆకలేస్తే చిరంజీవి గారి ఇంటికెళ్లి భోజనం చేసేవాడిని

: నాజర్ భావోద్వేగం

సినీ పరిశ్రమలో విలక్షణ నటనతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటుడు నాజర్, తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న గడ్డు పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టడానికి ముందు, ఆ తర్వాత అవకాశాల కోసం తిరుగుతున్న సమయంలో ఎన్నో ఆకలి రోజులను చూశానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ క్లిష్ట సమయంలో మెగాస్టార్ చిరంజీవి కుటుంబం తనకు అందించిన మద్దతును ఆయన ఎంతో భావోద్వేగంతో పంచుకున్నారు.అవకాశాల కోసం చెన్నైలో ఎదురుచూస్తున్న రోజుల్లో భోజనానికి కూడా ఇబ్బంది పడిన సందర్భాలు ఎదురయ్యాయని నాజర్ వెల్లడించారు. అలాంటి సమయాల్లో తాను చిరంజీవి ఇంటికి వెళ్లి భోజనం చేసేవాడ్నని తెలిపారు. అప్పట్లో చిరంజీవి వరుస షూటింగులతో బిజీగా ఉండేవారని, తన స్నేహితుడి ద్వారా చిరంజీవి అర్ధాంగి సురేఖను సంప్రదించి, ఇంట్లో భోజనం ఉందో లేదో తెలుసుకునేవాడ్నని వివరించారు. భోజనం అందుబాటులో ఉందని తెలియగానే అక్కడికి వెళ్లి తిని వచ్చేవాడ్నని చెప్పారు. ఒక్కోసారి తాను వెళ్లి భోజనం చేసి వచ్చిన విషయం చిరంజీవికి తెలిసేది కాదని, ఆయన షూటింగులో ఎక్కడో ఉండేవారని తెలిపారు. వారి కుటుంబం తనకు చేసిన ఆ సాయం వెలకట్టలేనిదని నాజర్ పేర్కొన్నారు.నటన వైపు అడుగులు వేయడంలో తన తండ్రి ప్రోత్సాహం ఎంతో ఉందని నాజర్ తెలిపారు. తనలోని ప్రతిభను గుర్తించి సినీ రంగంలోకి వెళ్లమని తండ్రే సూచించారని చెప్పారు. ఆ తర్వాత చెన్నై చేరుకుని ఓ చిన్న ఉద్యోగంలో చేరారు. యాక్టింగ్ స్కూల్ ఫీజు చెల్లించే స్తోమత లేకపోవడంతో, ఆఫీస్ సమయం ముగిసిన తర్వాత అదనంగా చిన్న చిన్న పనులు చేస్తూ డబ్బు ఆదా చేసుకున్నారు. చిత్రపరిశ్రమలో ఒక నటుడిగా నిలదొక్కుకోవడానికి తనకు దాదాపు 15 ఏళ్ల సమయం పట్టిందని ఆయన వివరించారు.ఇక తెలుగు చిత్రపరిశ్రమలో తన అరంగేట్రం గురించి మాట్లాడుతూ.. వెంకటేశ్ హీరోగా తెరకెక్కిన 'చంటి' సినిమాతో తాను టాలీవుడ్‌కు పరిచయమయ్యానని తెలిపారు. ఆ సమయంలో తనకు తెలుగు భాష అస్సలు రాదని, కానీ స్టార్ హీరో అయినప్పటికీ వెంకటేశ్ ఎంతో ఓపికగా ప్రతి డైలాగ్‌ను వివరించి, పాత్ర స్వభావాన్ని అర్థం చేసుకునేలా ప్రోత్సహించారని చెప్పారు.కష్టకాలంలో చిరంజీవి, సురేఖ చూపిన దాతృత్వం.. అలాగే వెంకటేశ్ అందించిన సహకారం తన సినీ ప్రయాణంలో ఎప్పటికీ మరచిపోలేనివని నాజర్ కృతజ్ఞతతో స్మరించుకున్నారు. ఎటువంటి గుర్తింపును ఆశించకుండా నిస్వార్థంగా చేసే సాయమే అత్యంత గొప్పదని ఆయన అన్నారు.

తెలిసిన వారినే ప్రశ్నించడానికి ఎందుకు వెనుకాడుతున్నాం?



సమాజంలో ఎక్కడైనా చిన్నపిల్లలపై లైంగిక వేధింపుల ఘటన జరిగినప్పుడు అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడి ఆవేదన వ్యక్తం చేస్తాం. కానీ ఆ వార్త పాతబడగానే మళ్లీ ఎప్పటిలాగే మౌనంలోకి జారిపోతామన్నది అంతే నిజం. తాజాగా ఈ అంశంపై బాలీవుడ్ నటి విద్యాబాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులపై జరిగే ఇలాంటి అఘాయిత్యాలను అరికట్టే బాధ్యత పిల్లలది కాదని.. పూర్తిగా పెద్దలదేనని కుండబద్దలు కొట్టారు. 2018 నుంచి -అర్పణ్- అనే స్వచ్ఛంద సంస్థకు గుడ్‌విల్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న విద్యాబాలన్.. చైల్డ్ సేఫ్టీ వీక్ సందర్భంగా సమాజంలోని లోపాలను ఎత్తి చూపారు. వేధింపులకు పాల్పడే వ్యక్తులు ఎవరూ పట్టుబడరనే ధీమాతోనే రెచ్చిపోతున్నారని విద్యాబాలన్ అభిప్రాయపడ్డారు. పిల్లల మౌనం.. కుటుంబ పరువు పోతుందనే పెద్దల భయం.. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సమాజం వెనుకాడే ధోరణే నేరగాళ్లకు కొండంత అండగా మారుతుందన్నారు. కఠినమైన అడుగులు వేయాల్సిన చోట పెద్దలంతా ఆగిపోతున్నారని.. మనకు ఎంతో నమ్మకమైన.. తెలిసిన వారినే ప్రశ్నించడానికి ఎందుకు వెనుకాడుతున్నామని విద్య సూటిగా ప్రశ్నించారు. సొంత కుటుంబంలోనే కొన్ని కఠినమైన హద్దులు గీయడం.. ఒక చిన్నారి ధైర్యం చేసి తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పినప్పుడు దాన్ని గుడ్డిగా కొట్టిపారేయకుండా నమ్మడం పెద్దల కనీస బాధ్యత అని విద్యాబాలన్ గుర్తు చేశారు. ఇంటి పరువు బజారున పడుతుందనే భయంతో నిజాన్ని నాలుగు గోడల మధ్యే సమాధి చేయడం వల్ల నేరగాళ్లకు మరింత బలం చేకూరుతుందని హెచ్చరించారు. పోక్సో చట్టం ఎంత కఠినంగా ఉందో? ప్రజల్లోకి తీసుకెళ్లి నేరం చేస్తే శిక్ష తప్పదనే భయం ప్రతి ఒక్కరిలో కలగాలన్నారు. గతంలో తాను నటించిన -కహానీ 2- సినిమాలో దుర్గా రాణి పాత్ర చేస్తున్నప్పుడే బాలల వేధింపుల వెనుక ఉన్న చేదు నిజాలు.. బాధితులపై జీవితాంతం ఉండే మానసిక గాయాల గురించి లోతుగా అర్థమైందని విద్యాబాలన్ గుర్తు చేసుకున్నారు. ఆ సినిమా విడుదలైన తర్వాతే ఇన్నాళ్లూ కార్పెట్ కింద దాచిపెట్టిన ఈ సున్నితమైన అంశంపై ఇళ్లలో చర్చ మొదలైందన్నారు. అయితే ఇలాంటి కథలను తెరకెక్కించేటప్పుడు దర్శక,నిర్మాతలు బాధితులను తప్పుపట్టకుండా.. సంచలనాల కోసం కాకుండా ఎంతో బాధ్యతగా చూపించాలని సూచించారు.కవలం సినిమాలు తీయడం వల్లనో? సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం వల్లో? చిన్నారులకు రక్షణ దక్కదని విద్యాబాలన్ తేల్చి చెప్పారు. సినిమాలు కేవలం ఒక చర్చను మాత్రమే మొదలుపెట్టగలవని ఆ తర్వాత క్షేత్రస్థాయిలో పనిచేసే సంస్థలకు అండగా నిలవడం.. బాధితులకు న్యాయం జరిగేలా చూడటం అందరి బాధ్యత అన్నారు. ఇటీవలే విద్యాబాలన్ -జైలర్ 2- లో కాంత పాత్రతో ఎలా అలరించారో తెలిసిందే. కల్పిక్ ఫ్యామిలీ వారసురాలిగా విద్య ఓ రేంజ్ లో అదరగొట్టారు. ప్రస్తుతం విద్య బాలన్ నటిస్తోన్న మరో మూడు బాలీవుడ్ చిత్రాలు ఆన్ సెట్స్ లో ఉన్నాయి.

'ఆయనతో ఒక్క ఫోటో చాలనుకున్నా..



ప్రముఖ నటి, దర్శకురాలు రేణూ దేశాయ్ చాలా కాలం తర్వాత మళ్లీ వెండితెరపై కనిపించబోతున్నారు. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఓం' చిత్రంతో ఆమె నటిగా పునరాగమనం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, ఈ అవకాశం ఎలా వచ్చింది, తన ఆరోగ్య రహస్యం ఏంటి అనే విషయాలపై ఆసక్తికరమైన వివరాలు పంచుకున్నారు.మమ్ముట్టి లాంటి గొప్ప నటుడితో కలిసి నటించే అవకాశం రావడం తనను ఆశ్చర్యపరిచిందని రేణూ దేశాయ్ అన్నారు. "గతేడాది ఆయన సినిమాలు చూస్తూ, ఎప్పటికైనా ఆయన్ను కలిసి ఒక ఫోటో దిగితే చాలనుకున్నాను. కానీ ఆయన సరసన నటించే అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదు" అని తెలిపారు. మహాశివరాత్రి రోజున తాను కామాఖ్య దేవాలయంలో ఉన్నప్పుడు చెన్నై నుంచి ఓ అసిస్టెంట్ డైరెక్టర్ ఫోన్ చేసి మమ్ముట్టి సినిమాలో భార్య పాత్రకు ఆఫర్ చేశారని చెప్పారు. మొదట దాన్ని ఒక ప్రాంక్ కాల్ అనుకుని నమ్మలేకపోయానని ఆమె గుర్తుచేసుకున్నారు. రెండు నెలల తర్వాత చిత్రానికి 'ఓం' అని పేరు ప్రకటించగానే తనకు గూస్‌బంప్స్ వచ్చాయని, ఇదంతా దైవ సంకల్పమేనని భావిస్తున్నానని అన్నారు.గత ఏడాది తనకు ఒక సర్జరీ జరిగిందని, దానివల్ల దాదాపు ఆరు నెలల పాటు పూర్తి విశ్రాంతి తీసుకున్నానని రేణూ దేశాయ్ తెలిపారు. ఆ సమయంలో కిచిడీ, పెసరపప్పు, సొరకాయ వంటి తేలికపాటి ఆహారం మాత్రమే తీసుకున్నానని చెప్పారు. ఈ ఆహార నియమాలు, విశ్రాంతి వల్లే శరీరంలో వాపు తగ్గి ఇప్పుడు మరింత ఫ్రెష్‌గా కనిపిస్తున్నానని తన ఆరోగ్య రహస్యాన్ని వెల్లడించారు. సోషల్ మీడియాలో సాధారణంగా కనిపించే తనకు భిన్నంగా, ఓ నటిగా మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడం సంతోషంగా ఉందని రేణూ దేశాయ్ పేర్కొన్నారు.

బన్నీ రేసులో బోయపాటి నెంబర్ - 4!



-పుష్ప- విజయంతో పాన్ ఇండియా బాక్సాఫీస్‌ను శాసిస్తున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తదుపరి సినిమాల విషయం లో పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం బన్నీ చేతిలో ఉన్న క్రేజీ ప్రాజెక్టుల జాబితా చూస్తే? అసక్తి అంతకంతకు రెట్టింపు అవుతుంది. అందులో మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను స్థానం ఇప్పుడు చర్చ నీయాంశంగా మారింది. అల్లు అర్జున్ తదుపరి సినిమాల రేసులో బోయపాటి ప్రాజెక్ట్ నాలుగో స్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బన్నీ ఫోకస్ అంతా తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తోన్న భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ -రాకా- పైనే పెట్టారు. సన్ పిక్చర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరు గుతోంది. గతంలో ఇద్దరి కాంబినేషన్‌లో రిలీజ్ అయిన -నరైనోడు- బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఈ నేపథ్యంలో బన్నీ కోసం బోయపాటి పవర్‌ఫుల్ మైథలాజికల్ టచ్ ఉన్న కథను సిద్ధం చేస్తున్నారని.. అది బన్నీకి బాగా నచ్చి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ప్రచారం జరుగుతోంది.అయితే ఏ సినిమా ఎప్పుడు పట్టాలెక్కుతుందన్నది అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది. లోకేష్ ప్రాజెక్ట్ మాత్రం వచ్చే ఏడాది పట్టాలెక్కుతుంది. ఈ సినిమా షూటింగ్ కూడా లోకేష్ వేగంగానే పూర్తి చేస్తారు. ఈ విషయంలో లోకేష్ పెద్దగా సమయం తీసుకోరు. చిత్రీకరణ ముగించే విషయంలో లోకేష్ -లియో- స్ట్రాటజీ అనుసరిస్తారని చిత్ర వర్గాల నుంచి తెలుస్తోంది. ఎలా చూసుకున్నా? బోయపాటి ప్రాజెక్ట్ పట్టాలెక్కాలంటే? ఎలా లేదన్నా రెండున్నరేళ్లకు పైగా సమయం పడుతుంది.